సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా సాగుతోంది. కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికి వెళ్లి గత ఎన్నికల్లో కూటమి పార్టీలు ఇచ్చిన హామీల అమలు, సంక్షేమ కార్యక్రమాలపై ఆరా తీస్తున్నారు. అలాగే నాలుగేళ్లలో చేపట్టబోయే అభివృద్ధి పనులతోపాటు ప్రజల్ని నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. టీడీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం ఈనెల 2న జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. తొలి రోజు నుంచి ప్రతి నియోజకవర్గంలో మంత్రుల నుంచి ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పార్టీ క్యాడర్ అంతా పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా ప్రతి ఇళ్లూ తిరుగుతూ కార్యక్రమ ఉద్దేశాన్ని వివరిస్తున్నారు. 'తొలి అడుగు' ప్రారంభం నుంచి ఎక్కడ ప్రభుత్వంపై చిన్న అసంతృప్తి కూడా వ్యక్తం కాలేదు. ఏ ఊరికి వెళ్లినా నాయకులకు ఘన స్వాగతం లభిస్తోంది. ఏడాది పాలనపై చేపట్టిన ఇంటింటా టీడీపీ సర్వేలో రెండో స్థానంలో ఉన్న జిల్లా అగ్రస్థానం వైపు దూసుకెళుతోంది.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి


ఆత్మకూరులో అభివృద్ధి చేసిన రోడ్డుపై నిలబడి సెల్ఫీ తీసుకుంటున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత


కప్పలబండలో తొలిఅడుగులో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, పార్టీ శ్రేణులు

తొలి అడుగు అదుర్స్..!

క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్తున్న టీడీపీ

అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తున్న ప్రభుత్వం

ఏడాది పాలనపై ప్రజల నుంచి సంతృప్తి

సంస్థాగతంగా టీడీపీ కేడర్ బలోపేతం

అన్నదాతా సుఖీభవ అడిగా



ఏడాది ప్రభుత్వ పాలనపై టీడీపీ 'తొలిఅడుగు' కార్యక్రమం బాగుంది. ఇంటి వద్దకే ఎమ్మెల్యేలు, పార్టీ కేడర్ వచ్చి, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి, చేపట్టబోయే పథకాల గురించి చెబుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో కొన్ని ఇప్పటికే నెరవేర్చారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై విత్తన సాగుకు చివరి దశకు వచ్చింది. ఇలాంటి సందర్భంలో రైతుకు అన్నదాత సుఖీభవ ఇవ్వాలని మా ఇంటికి వచ్చిన నాయకులను అడిగా.

-చిన్న వెంకటేష్, రైతు, ముదిగుబ్బ

పథకాలే ప్రచార అస్త్రాలుగా..

జిల్లాలో ఇటీవల హిందూపురంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, మడకశిరలో హోంమంత్రి వంగలపూడి అనిత, రాప్తాడులో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితతోపాటు ఎంపీ పార్థసారథి, ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, నియోజక వర్గ సమన్వయకర్తలతోపాటు గ్రామస్థాయి కార్యకర్తల వరకు అందరూ క్షేత్రస్థాయిలో ఇంటింటా తలుపు తట్టి ఏడాది పాలనపై ప్రజలకు వివరిస్తున్నారు. ఏడాది పాలనలో పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, మూడు ఉచిత సిలిండర్లు, తల్లికివందనం గురించి ప్రజలతో ఆరా తీస్తున్నారు. త్వరలో చేపట్టే అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను ఇంటింటా వివరించారు. ఆయా నియోజకవర్గాల్లో ఏడాది పాలనలో నిర్ణయాలు, విజయాలు, చేపట్టిన అభివృద్ధి పథకాలతోపాటు ఎన్నికల ముందు ఏమి హామీలిచ్చాం, వాటిలో ఏం నెరవేర్చామే చెబుతున్నారు. వచ్చే నాలుగేళ్ల చేపట్టబోయే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనకు, ఏడాదిలో కూటమి ప్రభుత్వం అభివృద్ధికి తేడాను తెలియజేస్తున్నారు. వైసీపీ కుట్ర పూరిత రాజకీయం, అసత్య ప్రచారంపై టీడీపీ కేడర్ ఘాటుగానే స్పందిస్తూ సవాళ్ల విసురుతోంది. టీడీపీ సవాళ్లను వైసీపీ స్వీకరించే సాహసం ఎంతమాత్రం చేయడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లాలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు టీడీపీ పూర్తి స్థాయిలో సంసిద్ధమవుతోంది.


సుపరిపాలనలో తొలిఅడుగులో భాగంగా పుట్టపర్తిలో ప్రజల నుంచి అభిప్రాయం నమోదు చేస్తున్న టీడీపీ నేతలు

అగ్రస్థానం వైపు ...

'తొలిఅడుగు' ఇంటింటి సర్వేకు సంబంధించి మన టీడీపీ యాప్‌లో నమోదైన వివరాల ప్రకారం జిల్లా బుధవారానికి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. జిల్లాలో 537932 ఇళ్ల నమోదు లక్ష్యం కాగా గురువారానికి 493865 పూర్తి చేశారు. ధర్మవరం నియోజక వర్గంలో 76615 ఇళ్లకు గాను 88971 నమోదుతో 116.13శాతం, కదిరి 84176 గాను 88110నమోదుతో 104.67 శాతం, రాప్తాడు 80802గాను 86329తో 106.84శాతం, పెనుకొండలో 76857ఇళ్లకు 78673తో 102.36 శాతం, మడకశిర 67723 ఇళ్లకు 72633 ఇళ్లతో 107.25 శాతం, పుట్టపర్తి, 69588గాను 40988 శాతం 58.9 శాతం, హిందూపురం 82223గాను 38350తో 46.64, శాతం ఇంటింటికీ 'తొలి అడుగు' పూర్తయ్యింది. ఇంకా మరో వారం మిగిలి ఉన్న నేపథ్యంలో రెండో స్థానం నుంచి అగ్రస్థానం సాధించేందుకు టీడీపీ బూత్ కన్వీనర్లు, కుటుంబ సారథులు, మండల కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులతోపాటు ఆయా నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేలు, పార్టీ క్యాడర్ తీవ్రంగా శ్రమిస్తోంది.

విజయవంతంగా...



సుపరిపాలనలో తొలిఅడుగు అన్ని నియోజక వర్గాల్లో విజయవంతగా సాగుతోంది. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో అమలు చేసిన పథకాలు, సాధించిన అభివృద్ధి, చేపట్టబోయే పథకాలపై మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు గ్రామస్థాయి కార్యకర్తల వరకు అందరూ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో నెరవేర్చినవి తెలియజేశాం. వచ్చే నాలుగేళ్లలో చేపట్టబోయే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలియజేశాం. ప్రజల నుంచి ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం అవుతోంది.

-అంజినప్ప, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

ఎమ్మెల్యే సారూ వచ్చారు



మా ఇంటి వద్దకు కదిరి ఎమ్మెల్యే సారూ వచ్చాడు. ప్రభుత్వ నుంచి ఏఏ పథకాలు అందుకున్నారు. ప్రభుత్వం పనితీరు బాగుందా? మీసమస్యలు ఏమిటి అని అడిగారు. తల్లికి వందనం, ఉచిత సిలిండర్లు, పింఛను అందుకుంటున్నట్లు చెప్పా. పక్కా ఇల్లు కావాలని అడిగా. మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికలు లేకపోయిన ఇంటి వద్దకే వచ్చి మా సమస్యలు తెలుసుకున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.

-అంజినమ్మ, పెద్దపల్లి, కదిరి

ఎట్టకేలకు..!



ఎంపీఈఓల సర్దుబాటుకు శ్రీకారం

ఉమ్మడి జిల్లాలో 323 మంది విధుల నిర్వహణ

అనంత జిల్లా ఎంపీఈఓల సర్దుబాటుకు కసరత్తు

శ్రీ సత్యసాయి జిల్లా యంత్రాంగం తీరుపై విమర్శలు

అనంతపురం అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో పని చేస్తున్న ఎంపీఈఓల సర్దుబాటుకు శ్రీకారం చుట్టారు. అనంతపురం జేడీఏ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ అనంత జిల్లాలోని ఏడీఏలతో గురువారం సమావేశమయ్యారు. ఏఏ రైతు సేవా కేంద్రంలో ఎంపీఈఓలను నియమించాలి..? ఎక్కువ విస్తీర్ణం కలిగిన ఏఏ ప్రాంతాల్లో ఎంత మంది ఎంపీఈఓలను సర్దుబాటు చేయాలన్న దానిపై సమాలోచనలు చేశారు. మరో మూడు, నాలుగు రోజుల్లో ఎంపీఈఓలను తగిన స్థానాల్లో సర్దుబాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. అనంత జిల్లా పరిధిలోని 189 మంది ఎంపీఈఓల సర్దుబాటుపై డివిజన్

(మిగతా 6లో...)


గ్రామంలో పశువులు, పక్షులకు ఏర్పాటుచేసిన శ్మశానవాటిక

అభివృద్ధిలో ఆదర్శం

- జాతీయ స్థాయికి గొల్లూరు ప్రగతి
- ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపిక
- హర్ ఘర్ జల్, ఓడీఎఫ్, చైతన్యకరణలో ముందడుగు
- స్వాతంత్ర్య వేడుకలకు సర్పంచుకు ఆహ్వానం

6 లో

చట్టాలపై అవగాహన ఉండాలి

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ


కార్యక్రమంలో మాట్లాడుతున్న రాయపాటి శైలజ

పుట్టపర్తి రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలకు సంబంధించిన చట్టాలు, హక్కులపై అవగాహన కల్గి ఉండాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని సాయిఆరామంలో స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం మహిళా సంక్షేమం, భద్రత, హక్కులపై జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌తో పాటు జిల్లా ఎస్పీ రత్న, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, ఆర్డీఓ సువర్ణ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్త్రీశిశు సంక్షేమశాఖ ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను చైర్‌పర్సన్ తిలకించారు. మహిళల రక్షణ, భద్రత, సాధికారత కోసం నేను సైతం అన్న ఫ్లెక్సీపై సంతకం చేశారు. అనంతరం అవగాహన కార్యక్రమం, మీడియాతో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం బాలికలు, మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తోంద న్నారు. పాఠశాల, కళాశాలల్లోని విద్యార్థినులు ఇప్పటి నుంచే చట్టాలతో పాటు మహిళా రక్షణ, భద్రత, సాధికారతపై చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ మహిళల సంక్షేమం, భద్రత, హక్కులపై అవగాహన కార్యక్రమం ఎంతో మంచిదన్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏడాది కాలం నుంచి పాఠశాలలు కళాశాలలతో పాటు మారుమూల గ్రామాల్లో సైతం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పాఠశాలలు, కళాశాలల్లో శక్తియాప్ వారియర్స్, ఈగల్‌క్లబ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మాట్లాడుతూ తల్లితండ్రులు తమ పిల్లలకు ఆడ, మగ తేడా లేకుండా సమానంగా చూడాలన్నారు. అనంతరం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఆపదలో ఉన్న మహిళలను ఆదుకోవడం ప్రభుత్వ ధ్యేయం అన్న పోస్టర్‌ను, దిసేఫ్టీ నెట్‌ప్రొటెక్టింగ్ చిల్డ్రన్ ఇన్‌ది డిజిటల్ ఏజ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళా డీఎస్పీ ఆదినారాయణ, డీఈఓ కిష్టప్ప, మహిళలు పాల్గొన్నారు.

పలువురు ఐసీడీఎస్ అధికారుల బదిలీ

పుట్టపర్తి రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఐసీడీఎస్ అధికా రులను బదిలీచేస్తూ ప్రభుత్వ కార్యదర్శి సూర్యకుమారి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఇందులో భాగంగా మడకశిర సీడీపీఓగా పనిచేస్తున్న పీపీ జ్ఞానప్రసూనకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ గుంటూరు జిల్లా ఐసీడీఎస్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరక్టర్‌గా బదిలీ చేశారు. తిరుపతి జిల్లా పుత్తూరు సీడీపీఓగా విధులు నిర్వర్తిస్తున్న ప్రమీలను జిల్లా స్త్రీ శిశుసంక్షేమ అభివృద్ధి సాధికారత అధికారిగా, సోమందేపల్లి సీడీపీఓగా విధులు నిర్వర్తిస్తున్న బానుశ్రీని ఏపీ మహిళా సహకార ఆర్థిక సంస్థ ఎన్‌ఫోర్సుమెంట్ డైరక్టరుగా డిప్యుటేషన్ ప్రాతిపదికన నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఖైదీలకు సదుపాయాలు సక్రమంగా ఉండాలి

ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి భీమారావు

ధర్మవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఖైదీలకు వసతి సదుపాయాలు సక్రమంగా ఉండేలా చూడాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి భీమారావు తెలిపారు. పట్టణంలోని సబ్‌జైలును గురువారం సాయంత్రం ఆయన తనిఖీచేశారు. జైలులో వంటగది, ఖైదీల గదులు, సరుకుల నిల్వ ఉన్న గది పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఖైదీల గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జైలు సూపరింటెండెంట్ శివప్రసాద్‌ను ఆదేశించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. ఏమైనా సమస్యలున్నాయా అని వారని అడిగి తెలుసుకున్నారు. అందరూ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశులు, న్యాయవాదులు సుమలత, బిల్లే రవీంద్ర పాల్గొన్నారు.


సబ్‌జైలు వంట గదిలో భోజనాన్ని పరిశీలిస్తున్న న్యాయాధికారి భీమారావు

దొరికింది.. పెద్ద చేప

ఏసీబీ వలలో కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్

రూ.5 లక్షలు తీసుకుంటూ దొరికిన నారాయణస్వామి

(వివరాలు 7లో..)

ఫోర్జరీ సంతకాలతో నకిలీ సర్టిఫికెట్లు

పరిగి పీహెచ్‌సీలో ఆలస్యంగా వెలుగులోకి..

పరిగి, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఓ అజ్ఞాతవ్యక్తి డాక్టర్ల సంతకాలను ఫోర్జరీ చేసి, నకిలీ ఫిజికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్‌లు సృష్టించి విక్రయిస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో వైద్యులు స్వరూప్‌రెడ్డి, నవీన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డాక్టర్ స్వరూపారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కొంతకాలం నుంచి ఓ అజ్ఞాత వ్యక్తి మా సంతకాలను ఫోర్జరీ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. పీహెచ్‌సీలో తాము అందుబాటులో లేని సమయంలో మేం చెప్పామంటూ నర్సులతో మాట్లాడి మా సీల్‌ను వేయించుకుని వెళ్తున్నట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. ఆ ఫిజికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్‌ను విద్యార్థులకు రూ.1200నుంచి రూ.1700దాకా అమ్ముకున్న ట్లు తెలిసిందన్నారు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశామన్నారు. ఫోర్జరీ చేసిన వ్యక్తి పట్టుబడేవరకు పీహెచ్‌సీ ఫిజికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్‌ను ఇవ్వబోమన్నారు.


ప్రాథమిక ఆరోగ్యకేంద్రం



తాత్కాలికంగా ఫిట్నెస్ సర్టిఫికెట్లను ఆపేసినట్లు పెట్టిన బోర్డు

పీహెచ్‌సీ సిబ్బంది పనేనా ?

ఫిజికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఫోర్జరీ చేసి విక్రయిస్తున్నది పీహెచ్‌సీ సిబ్బందేనా లేక బయటి వ్యక్తులా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు ఆస్పత్రిలో సీసీ కెమెరాల ద్వారా ఫోర్జరీ చేసిన వ్యక్తిని గుర్తించి, వాస్తవాలను నిగ్గుతేల్చాలని స్థానికులు కోరుతున్నారు.

వలస బతుకు ఛిద్రం

- నెల కిందటే పెనుకొండకు బళ్లారి వాసి
- పంక్చర్ షాపు పెట్టుకుని జీవనం
- కంటైనర్ దూసుకురావడంతో దుర్మరణం (7లో..)

భయం ఏదీ..?

పోలీసులపై తిరగబడుతున్న వైనం

మసకబారుతున్న ఖాకీ ప్రతిష్ట

చూసీచూడనట్లు ఉన్నతాధికారులు

కొన్నిచోట్ల వైసీపీ నాయకులదే హవా



సమాజం కట్టుతప్పకుండా ఉండాలంటే కాస్తోకూస్తో పోలీసుల భయం ఉండాలి. కానీ హిందూపురం నియోజకవర్గంలో కొన్ని అసాంఘిక శక్తులు పోలీసులపైనే తిరగబడి దాడి చేసేందుకు యత్నిస్తున్నాయి. అయితే ఏ కారణాల వలనో కానీ పోలీసు ఉన్నతాధికారులు మాత్రం ఈ విషయాలను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీనిపై సాధారణ ప్రజానీకం నుంచి విమర్శలు వినవస్తున్నాయి. - ఆంధ్రజ్యోతి, హిందూపురం

కొన్ని ఉదాహరణలు

- గత ఏడాది హిందూపురం మండలంలోని కర్ణాటక సరిహద్దుకు ఆనుకుని ఉన్న గ్రామంలో జాతర సందర్భంగా కొంతమంది యువకులు గొడవ పడ్డారు. ఇది గమనించి, అక్కడ విధుల్లో ఉన్న హోంగార్డ్ సర్ది చెప్పేందుకు వెళ్లగా తిరగబడి దాడి చేశారు.
- నాలుగు నెలల కిందట హిందూపురంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న యువకులను హెచ్చరించడానికి వెళ్లిన ఓ కానిస్టేబుల్‌పై తిరగబడి (మిగతా 6లో..)

14 మంది కానిస్టేబుళ్ల బదిలీ

పుట్టపర్తి రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న 14 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఎస్పీ రత్న గురువారం ఉత్తర్వులు జారీచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఐదుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 9 మంది కానిస్టేబుళ్లకు స్థానచలనం కల్పించారు. వారు తక్షణమే బదిలీ అయిన చోట రిపోర్టు చేసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.

వడ్డీ జలగల అరాచకాలు

వారానికి నూటికి రూ.10 వడ్డీ

అసలు కంటే ఎక్కువ రెట్లు చెల్లింపు

ఇంకా.. ఇవ్వాలంటూ వేధింపులు

ధర్మవరంలో రెండు చోట్ల దాడులు

కేసులు నమోదు

(వివరాలు 7వ పేజీలో...)

కుక్కలతో జనం బెంబేలు



కుక్కలతో అనంతపురం నగర వాసులు ఆందోళన చెందుతున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో సుమారు 50వేలకు పైగా కుక్కలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. నగరంలో రోజురోజుకు కుక్క కాటు బాధితులు పెరుగుతున్నారు. వాహనదారులు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, చిన్నారులు వీధుల్లో భయపడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఒక్కోసారి 10-15 కుక్కలు వీధుల్లో సంచరిస్తూ భయానక పరిస్థితులను సృష్టిస్తున్నాయి. కొన్ని వీధుల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని నడవాల్సిన పరిస్థితి వస్తోంది. ఇంతటి భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్న కుక్కలను నియంత్రించడం, తరలించడంలో నగరపాలక సంస్థ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న విమర్శలు వస్తున్నాయి. నగరంలో అనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) టీకాను ఉపయోగించి కుక్కలను నియంత్రించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది.



వృద్ధులపై దాడి చేస్తున్న శునకాలు



వాహనదారుడిపైకి ఎగబడుతున్న కుక్క

నగరంలో 50వేలకు పైగా శునకాలు

నియంత్రణ చర్యలు శూన్యం

పెరిగిపోతున్న కుక్కకాటు బాధితులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అనంత నగరపాలక సంస్థలో కుక్క కాటు బాధితులు రోజురోజుకు పెరిగిపోతున్నారు. హౌసింగ్‌బోర్డులో ఇటీవల ఓ వ్యక్తి ఫిల్టర్ నీళ్ల కోసం వెళ్లిన సమయంలో కుక్క కాటుకు గురయ్యాడు. రామ్‌నగర్‌లో ఫ్రిజ్ రిపేరీ కోసం వెళ్లిన ఓ మెకానిక్‌ని రెండు నెలల క్రితం కుక్క కరిచిన దెబ్బతో నేటికీ నొప్పి తగ్గలేదని వాపోతున్నాడు. రామచంద్రనగర్‌లో ఓ చిన్నారి అంగడికి వెళ్లి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో కుక్క కాటుకు గురైంది. ఇలా నగరంలో రోజురోజుకి కుక్క కాటు బాధితులు పెరిగిపోతున్నారు.

కుక్క కాటుకు ప్రథమ చికిత్స

కుక్కకాటుకు శస్త్రచికిత్స గాయం తీవ్రతపై ఆధారపడి ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. చిన్న కాట్లకు సబ్బు, నీటితో కడగడం, యాంటీ బయోటిక్ లేపనం, శుభ్రమైన కట్టుతో కప్పడం వంటి ప్రాథమిక చికిత్స సరిపోతుంది. పెద్ద కాట్లకు వైద్యసంరక్షణ అవసరం ఉంటుంది. ఇందులో కుట్లు, యాంటీ బయోటిక్స్ లేదా రేబీస్ లేదా టాటానస్ టీకాలు వంటివి అందుబాటులో ఉన్నాయి. కుక్క కాటు తర్వాత ఏవైనా ఇన్‌ఫెక్షన్ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

ప్రభుత్వం అనుమతిస్తే ఏబీసీ కేంద్రం ఏర్పాటు



నగరంలో కుక్కల బెడద ఉన్న మాట వాస్తవమే. వీధి, పెంపుడు కుక్కలు నగరంలో రోజురోజుకు పెరిగిపోతున్నాయి. గతంలో కుక్కలు పట్టి తరలించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిస్తే కుక్కలను నియంత్రించవచ్చు. కుక్కల సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఉన్నతాధికారులకు పంపించాం. జంతుసంక్షేమ సంస్థల ఫిర్యాదుతో కుక్కలను పట్టకూడదని, ఏబీసీ టీకా వినియోగించరాదని ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వం అనుమతిస్తే ఏబీసీ సెంటర్ ఏర్పాటు చేయవచ్చు.

- రంగస్వామి, ఎంహెచ్ఓ

కసాపురానికి శ్రావణ శోభ

నెట్టికంటి దర్శనానికి పోటెత్తనున్న భక్తులు

శనివారాల్లో వాహనసేవలు

మంగళవారాల్లో వెండి రథోత్సవాలు



నెట్టికంటి ఆంజనేయస్వామి విరాట్టు

గుంతకల్లు, జూలై 24(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం ప్రారంభం కానుండగా కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానం నెలరోజులపాటు శోభాయమానం కానుంది. ఆంజనేయ స్వామి భక్తులు వేయి కన్నులతో ఎదురు చూసే శ్రావణ మాసం శుక్రవారం ప్రారంభం కానుంది. శ్రావణ మాసం ప్రారంభమైన మరుసటిరోజే తొలి శనివారం. దీంతో నెలలో ఐదు శనివారాల్లో ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగు మంగళవారాల్లో కూడా ప్రత్యేక పూజలు, స్వామివారికి విశేష అలంకారాలు చేయనున్నారు. ఈ తొమ్మిది రోజుల్లో జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలు, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలి రానున్నారు.

వేలాదిగా రానున్న భక్తులు

శ్రావణ మాసంలోని మంగళ, శనివారాల్లో ఒకేరోజు జిల్లాలోని కసాపురం, నేమకల్లు, మురడి గ్రామాలలోని ఆంజనేయస్వామి దేవస్థానాలను సందర్శించి, మొక్కులను తీర్చుకుంటారు. శనివారాల్లో కసాపురం ఆంజనేయ స్వామి దేవస్థానానికి వేలాదిగా భక్తులు తరలివచ్చి ఉత్సవ కార్యక్రమాల్లో పాల్గొంచుకుంటారు. ఈసారి చివరిదైన ఐదో శనివారం అమావాస్య కావడంతో ఆరోజు భక్తులు నిదుర చేయడానికి పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. భక్తులకు వసతి, రద్దీ నియంత్రణ, ప్రసాద వితరణ, అన్నదానం, వైద్యం, తాగునీటి సదుపాయాల కల్పనకు ఆలయ అధికారులు శుక్రవారం సమీక్ష నిర్వహించనున్నారు. ఉత్సవ దినాలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటం కారణంగా ఆలయంలో ప్రదక్షిణను రద్దు చేయనున్నట్లు ఈఓ వాణి తెలిపారు. ఉత్సవాల్లో భక్తులను తరలించేందుకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. గతేడాది గుంతకల్లు నుంచి కసాపురానికి ఎమ్మెల్యే సొంత ఖర్చుతో ఉచిత బస్సులను నడిపారు.

ఉత్సవ కార్యక్రమాలు ఇలా..

- జూలై 26వ తేదీ మొదటి శనివారం సీతారామ సహిత ఆంజనేయ స్వామికి శేషవాహనోత్సవం
- ఆగస్టు 2: స్వామివార్లకు హనుమద్ వాహనోత్సవం
- ఆగస్టు 9: స్వామివార్లకు గజ వాహనోత్సవం
- ఆగస్టు 16: స్వామివార్లకు గరుడ వాహనోత్సవం
- ఆగస్టు 23: ఒంటె వాహనోత్సవం
- జూలై 29, ఆగస్టు 5, 12, 19, తేదీల్లో నాలుగు మంగళవారాల్లో స్వామివార్లకు వెండి రథోత్సవం నిర్వహిస్తారు.

ఏమిటో అతగాడి ధైర్యం..?

డీపీఓలో ఓ డిజిటల్ అసిస్టెంట్ బరితెగింపు

సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో అక్రమాలు

చూసీచూడనట్లుగా ఉంటున్న ఉన్నతాధికారి



అనంతపురం న్యూటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఓ డిజిటల్ అసిస్టెంట్ బరితెగించి వ్యవహరిస్తుండటంతో జిల్లా పంచాయతీ కార్యాలయం(డీపీఓ)లో ఏమి జరుగుతోందో అర్థం కాని పరిస్థితి నెల కొంది. డిజిటల్ అసిస్టెంట్ల బదిలీల్లో భాగంగా ఆ డిజిటల్ అసిస్టెంట్‌తో పాటు మరో గుమస్తా చేతులు కలిపి ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న ప్రచారం ఉంది. ఆ డిజిటల్ అసిస్టెంట్ డీపీఓ పేరుతో తనకు కావాల్సిన వారికి, ముడుపులు ముట్టచెప్పిన వారికి ఎక్కడికి కావాలంటే అక్కడికి బదిలీ చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గిట్టని వారికి చుక్కలు చూపించినట్లు ప్రచారం జరుగుతోంది. కింగ్‌పిన్‌గా చెప్పుకుంటునన ఆ డిజిటల్ అసిస్టెంట్ ఆత్మకూరు మండలం నుంచి అనంతపురం రూరల్‌కు బదిలీ చేయించుకున్నారు. ఇది ఎలా సాధ్యమో డీపీఓకే తెలియాలి. ఇదే మార్గంలో మరికొందరు ఉన్నారు. ఇక గిట్టని వారికి సంబంధించి... గత ఎడాదే అనిల్‌కుమార్ అనే డిజిటల్ అసిస్టెంట్ బదిలీపై రాజీవ్‌కాలనీ పంచాయతీకి వచ్చారు. కొద్దిరోజులు డీపీఓ, కలెక్టరేట్‌లో కూడా డెప్యుటేషన్‌పై పని చేశారు. ఆయన పేరు బదిలీలో లేకపోయినా, తన తల్లికి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని చెప్పినా దూరంగా ఉన్న బెళుగుప్పకు పంపే ప్రయత్నం చేశారు. దీనిపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేయడంతో 'మీరు బెళుగుప్పకు వెళ్లినా సమస్య ఏముంటుంది? ఎలాగూ తిరిగి డెప్యుటేషన్‌పై కలెక్టరేట్‌లోనే కదా పని చేసేది' అని ఉచిత సలహా ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఆ డిజిటల్ అసిస్టెంట్ ఆక్రోశం భరించలేక 'మీరేందుకు ఆత్మకూరు నుంచి కందుకూరు వేయించుకున్నారు. మీరు కూడ డీపీఓ కార్యాలయంలోనే కదా డెప్యుటేషన్‌పై చేసేది మీరు బెళుగుప్ప ఎందుకు వేయించుకోలేదని డీపీఓ ఎదుటే ప్రశ్నించినట్లు తెలిసింది. దీన్ని విన్న డీపీఓ నాగరాజనాయుడు ఖంగుతిన్నట్లు సమాచారం. దీంతో ఇక్కడ ఉన్న సీసీల్లో ఎవరినైన అవసరం అయితే మరోప్రాంతానికి వేసి అయిన నీకు అన్యాయం జరగకుండా చూస్తానని డీపీఓ హామీ ఇచ్చినట్లు సమాచా రం. ఈ పరిణామాలు గమనిస్తే డిజిటల్ అసిస్టెంట్ ఏ స్థాయిలో చెలరేగిపోతున్నాడో అర్థం చేసుకోవచ్చు. బదిలీల కౌన్సెలింగ్‌లో భాగంగా అభ్యర్థులు రాసుకున్న ప్లేస్‌మెంట్స్‌ను కూడా మార్చినట్లు ప్రచారం ఉంది. దీంతో పాటు కలెక్టర్ ఆమోదం పొంది వచ్చిన జాబితాలో కూడా పెద్ద ఎత్తున మార్పులు, చేర్పులు చేసి కలెక్టర్‌ను, డీపీఓను బురిడీ కొట్టించారన్న ప్రచారం జరుగుతోంది. ఇక మన పని అయిపోయింది. ఇక్కడే ఉంటే సమస్యల్లో పడే అవకాశం ఉంది. డెప్యుటేషన్ రద్దు చేయించుకుని, ఇక్కడి నుంచి జారుకుంటే బెటరని ఆ డిజిటల్ అసిస్టెంట్ తన సన్నిహితుల వద్ద చెప్పినట్లు సమాచారం. ఇంత తతంగం జరుగుతున్నా డీపీఓ నాగరాజనాయుడు మాత్రం ఏమి పట్టించుకోకుండా ఉంటున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

అభివృద్ధిలో ఆదర్శం

• జాతీయ స్థాయికి గొట్లూరు ప్రగతి • ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపిక

హర్ ఘర్ జల్, ఓడీఎఫ్, చెత్తసేకరణలో ముందడుగు

స్వాతంత్ర్య వేడుకలకు సర్పంచ్‌కు ఆహ్వానం

స్వచ్ఛ భారత్‌లో జిల్లాలోనే ఆదర్శ గ్రామం



కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో గొట్లూరు పంచాయతీ

గ్రామ పంచాయతీ స్వరూపం

మొత్తం జనాభా : 4,678

పురుషులు : 2,372

స్త్రీలు : 2,306



గొట్లూరు గ్రామ ముఖద్వారం

ధర్మవరం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరును ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసి, సర్పంచ్ పిట్టా నరసమ్మను ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవానికి రావాలని కేంద్ర ప్రభుత్వం ఆహ్వానం పంపింది. దేశ వ్యాప్తంగా పలు విభాగాల్లో ఉత్తమ గ్రామ పంచాయతీలను ఎంపిక చేశారు. మన రాష్ట్రంలో మూడు పంచాయతీలను ఎంపిక చేయగా అందులో గొట్లూరు ఒకటి కావడం గమనార్హం. హర్‌ఘర్‌జల్(ఇంటింటికి తాగునీరు), ఓడీఎఫ్ (బహిరంగ మలవిసర్జన రహిత గ్రామం), చెత్త సేకరణ కేంద్రం నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరచడంతో గొట్లూరు ఉత్తమ పంచాయతీగా ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. జాతీయ స్థాయిలో తమ గ్రామం పేరు రావడం పట్ల సర్పంచ్‌తో పాటు పంచాయతీ సెక్రటరీ గణేష్, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానం నుంచి ఆదర్శం వైపు

వైసీపీ పాలనలో గ్రామంలో చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని వాడుకలోకి తేకుండా వదిలేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో రూ.4లక్షల వ్యయంతో ఆ కేంద్రానికి మరమ్మతులు చేయించి వాడుకలోకి తెచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో ప్రతిరోజు పంచాయతీలో పారిశుధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించి, కేంద్రానికి తరలిస్తున్నారు. అక్కడ చెత్తను తడి, పొడిగా విభజించి తొట్టిల్లో వేసి ఎరువుగా తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇలా వచ్చిన నగదును పంచాయతీ అభివృద్ధికి వాడుకుంటున్నారు. ఈ కేంద్రం ప్రస్తుతం జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తోంది. ధర్మవరం డివిజన్ స్థాయిలో చెత్తసేకరణ కేంద్రాలపై ఇక్కడే సిబ్బందికి, కార్మికులకు శిక్షణ కూడా ఇస్తున్నారు. ప్రస్తుతం ఈ కేంద్రం గ్రామాభివృద్ధికి ఆదర్శంగా నిలుస్తోంది.



చెత్త సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

ఇంటింటికీ తాగునీరు

హర్‌ఘర్ జల్ పథకంతో గ్రామంలో ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నారు. సుమారు రూ. 24లక్షల వ్యయంతో పైపులైన్లు, తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి తాగునీరు సరఫరా చేస్తున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు.

బహిరంగ మలవిసర్జన రహిత గ్రామం

ఇంటింటికి మరుగుదొడ్డి ఏర్పాటుతో బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా గొట్లూరు ఆవిర్భవించింది. ఐహెచ్ఎల్ పథకంతో గ్రామంలో ప్రతి ఇంటివద్ద మరుగుదొడ్డిని ప్రజలు ఏర్పాటు చేసుకున్నారు.



గ్రామంలో పరిశుభ్రంగా ఉన్న ప్రధానవీధి

చేపట్టిన అభివృద్ధి పనులు

- రూ.1.10కోట్లతో సీసీరోడ్లు ఏర్పాటు
- 90లక్షలతో మురుగు కాలువల ఏర్పాటు
- రూ.2.37లక్షలతో జడ్పీ హైస్కూల్లో కిషన్‌షెడ్ కోసం
- రూ.40 లక్షలతో సచివాలయ భవన నిర్మాణం
- రూ.20 లక్షలతో రైతుసేవా కేంద్రం ఏర్పాటు
- రూ.9లక్షలతో ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణం
- రూ. ఆరులక్షలతో ఈద్గా కాంపౌండ్ వాల్ నిర్మాణం

గతంలోనూ అవార్డులు

గొట్లూరు పంచాయతీకి గతంలోనూ నాలుగు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అవార్డులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. స్వచ్ఛభారత్, గ్రామాభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు అందజేసినట్లు తెలిపారు. అప్పట్లో కూడా జాతీయ, రాష్ట్రస్థాయిలో గొట్లూరును ఎంపికచేసి అప్పటి గ్రామ సర్పంచ్ శివయ్యకు అవార్డులు అందజేసినట్లు రికార్డులు ఉన్నాయి.

పశువులు.. పక్షులకు శ్మశాన వాటిక

గ్రామంలో మనుషులకే కాకుండా పశువులు, పక్షులకు కూడా శ్మశాన వాటిక ఏర్పాటు చేశారు. పశువులు, పక్షులు చనిపోతే వాటిని ఎక్కడపడితే అక్కడ ఖననం చేయకుండా, వాటికోసం ప్రత్యేకంగా శ్మశానవాటికను ఏర్పాటు చేశారు. దీంతో ఆ గ్రామానికి వచ్చిన వారు దాన్ని చూసి అభినందిస్తున్నారు.

ఆనందంగా ఉంది



మా గ్రామాన్ని ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేయడం ఆనందంగా ఉంది. స్వాతంత్ర్య దినోత్సవానికి ఢిల్లీకి రావాలని ఆహ్వానం పంపారు. మా గ్రామ అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేశాం. గ్రామ పంచాయతీ, మండల అధికారుల సమన్వయం, మా గ్రామప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నాం. మంత్రి సత్యకుమార్‌యాదవ్ మా గ్రామం కోసం సీసీరోడ్లు, తదితర వాటిని మంజూరు చేయించారు. అభివృద్ధికి సహకరించిన మంత్రి, రాష్ట్ర ప్రభుత్వానికి మా గ్రామ ప్రజల తరపున ధన్యవాదలు.

- పిట్టా నరసమ్మ, గ్రామసర్పంచ్, గొట్లూరు



ఇంటింటి చెత్తసేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్, గ్రామ సెక్రటరీ

భయం ఏదీ..?

(5వ పేజీ తరువాయి)

దాడికి యత్నించారు. ఆయన ఎలాగో తప్పించుకుని బయటపడ్డాడు.

- ఆరు నెలల కిందట కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై తీసుకెళ్తుండగా హిందూపురం సర్కిల్‌లోని ఓ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే హెడ్‌కానిస్టేబుల్ పట్టుకునేందుకు ప్రయత్నించారు. అయితే ఆ యువకులు అతడిపై రాళ్లు రువ్వారు. దీంతో ఆయన వారి బారి నుంచి తప్పించుకోవడానికి పారిపోవాల్సి వచ్చింది.
- తాజాగా హిందూపురంలోని రహమత్‌పురం ప్రాంతంలో విధుల్లో ఉన్న పోలీసులపై దాడికి యత్నించారు. అయితే ఇంత జరిగినా పోలీసు అధికారులు గోప్యంగా ఉంచారు. పత్రికల్లో రావడంతో స్పందించి పోలీసులపై తిరగబడిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో ఓ వ్యక్తి ఏఎస్ఐపై తిరగబడి ద్విచక్రవాహనంతో ఢీకొట్టడానికి ప్రయత్నించాడు.

పోలీసులంటే లెక్కలేదు

హిందూపురం సబ్‌డివిజన్‌లో పోలీసుల ప్రతిష్ట మసకబారుతోంది. కొన్ని అసాంఘిక శక్తులు, అడ్డదారుల్లో డబ్బు సంపాదించేవారు ఏమాత్రం భయం లేకుండా పోలీసులపైనే తిరగబడుతున్నారు. దీంతో ఇక తమనేం రక్షిస్తారంటూ సామాన్యుల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. హిందూపురం సబ్‌డివిజన్‌లో వైసీపీ నాయకులు, సానుభూతిపరులు ఇప్పటికీ పోలీసులపై తిరగబడుతున్నారు. గత ఐదేళ్లలో విచ్చలవిడిగా వ్యవహరించిన ఆ పార్టీ నాయకులు ప్రభుత్వం మారినా కొందరిలో మార్పు రాలేదు. దీంతో ఇప్పటికీ పోలీసులంటే లెక్క లేకుండా ప్రవర్తిస్తున్నారు.

టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదు

ఇటీవల పట్టణంలోని ఓ పోలీస్ స్టేషన్‌లో పలు కేసులున్న వైసీపీ నాయకుడు అక్కడున్న అధికార పార్టీ నాయకులపైనే తిరగబడ్డాడు. అయినా పోలీసు అధికారులు మిన్నకుండిపోయారు. వైసీపీ పాలన అంతం అయ్యి ఏడాది గడిచినా, ఇప్పటికీ కొంతమంది వైసీపీ నాయకులకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని పార్టీ అధిష్టానం, ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి టీడీపీ నాయకులు తీసుకెళ్లినట్లు సమాచారం. గత ప్రభుత్వ పాలనలో పని చేసిన పోలీసులు, సిబ్బంది ఉండటంతోనే ప్రస్తుతం వైసీపీ నాయకుల మాటే చెల్లుబాటు అవుతోందని, తమ ప్రభుత్వం వచ్చినా, అన్యాయమే జరుగుతోందంటూ ప్రతి రోజూ ఎవరో ఓ కార్యకర్త ఎమ్మెల్యే కార్యాలయంలో గోడు వెళ్లబోసుకుంటున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో టీడీపీ నాయకులు నోరు విప్పడానికి జంకారు. కొంతమంది ముఖ్య నాయకులే పార్టీ పిలుపునిచ్చిన నిరసన కార్యక్రమాలకు రావడానికి జంకారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడానికి కూడా టీడీపీ నాయకులు వెళ్లడానికి భయపడేవారు. అలాంటిది కొత్త ప్రభుత్వం వచ్చిన ఏడాది తరువాత కూడా వైసీపీ నాయకులు దర్జాగా వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో పంచాయతీలు, దందాలు చేస్తున్నారు. ఇందుకు కొంత మంది పోలీసు అధికారులు కూడా ఆ పార్టీ నాయకులకు అండగా నిలుస్తున్నారని ఆరోపణలు బలంగా ఉన్నాయి. వైసీపీ నాయకులను ఇలాగే వదిలేస్తే వచ్చే స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుందని కూటమి నాయకులే బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు.

గడువు పొడిగింపు

నెలాఖరుదాకా వాతావరణ బీమా ప్రీమియం చెల్లించవచ్చు: జేడీఏ


అనంతపురం అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వాతావరణ బీమా ప్రీమియం చెల్లింపు గడువును ఈనెలాఖరు దాకా పొడిగించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వరకే ఉన్న గడువును జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పొడిగించారన్నారు. వాతావరణ ఆధారిత బీమాను వేరుశనగ, పత్తి, దానిమ్మ, చీనీ, టమోటా, అరటి పంటలకు వర్తింపజేశారన్నారు. ఆయా పంటలను మండల యూనిట్‌గా పరిగణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తారన్నారు.

వాతావరణ ఆధారిత బీమా ప్రీమియం వివరాలు..


పంట	బీమా మొత్తం (హెక్టారుకు)	రైతు వాటా ఎకరాకు	హెక్టారుకు	గడువు
వేరుశనగ	80000	640	1600	జూలై 31
పత్తి	95000	1140	1600	జూలై 31
దానిమ్మ	187500	3750	9375	జూలై 31
చీనీ	137500	2750	6875	జూలై 31
టమోటా	80000	1600	4000	జూలై 31
అరటి	150000	3000	7500	జూలై 31

పారిపోయిన హాస్టల్ విద్యార్థులు


పోలీసులకు ఫిర్యాదు చేసిన వార్డెన్




బాబు



నవదీప్



కె. మణికంఠ



ఎస్. మణికంఠ

అనంతపురం క్రైం, జూలై 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని బీసీ హాస్టల్‌లో ఉంటూ, పొట్టిశ్రీరాములు పాఠశాలలో చదువుకుంటున్న నలుగురు విద్యార్థులు పారిపోయారు. పాఠశాలలో హెచ్‌ఎం మందలించినందుకు వారు ఇలా చేశారని అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. పారిపోయినవారిలో పదో తరగతి విద్యార్థులు ఇద్దరు, తొమ్మిది, ఎనిమిదో తరగతి విద్యార్థులు ఒక్కొక్కరు ఉన్నారు. ఉదయం పాఠశాలకు వెళ్లి విద్యార్థులు సాయంతమైనా హాస్టల్‌కు చేరలేదు. దీంతో వార్డెన్ మస్తాన్ మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, విద్యార్థుల కోసం గాలిస్తున్నామని త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. నార్పల మండలం నడిమిదొడ్డికి చెందిన నాగప్ప కుమారుడు బాబు(14), కూడేరు మండలం అరవకూరుకు చెందిన చంద్రశేఖర్ కుమారుడు నవదీప్(14), గోరంట్ల మండలం తోటమాకులపల్లికి చెందిన శేషాద్రి కుమారుడు కె.మణికంఠ(13), గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన విక్రాంత్ కుమారుడు ఎస్.మణికంఠ(12) అదృశ్యమయ్యారు. వీరంతా 3వ రోడ్డులోని బీసీ హాస్టల్ నంబర్ 2లో ఉంటూ, పొట్టి శ్రీరాములు పాఠశాలలో చదువుకుంటున్నారు. పాఠశాలకు సక్రమంగా హాజరు కావడం లేదని, టీసీ ఇచ్చి పంపుతామని హెచ్‌ఎం శ్రీదేవి మందలించారని, ఈ కారణంగానే విద్యార్థులు వెళ్లిపోయి ఉండవచ్చని వార్డెన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యార్థులు అదృశ్యమైన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేశామని పేర్కొన్నారు. ముగ్గురు పిల్లలు స్కూల్ యూనిఫాం ధరించారని, విద్యార్థి బాబు పింక్ షర్ట్, నలుపు రంగు ప్యాంటు వేసుకున్నారని వివరించారు.

ఎట్టకేలకు..!

(5వ పేజీ తరువాయి)

వారిగా ఆయా ఏడీఏలతో జేడీఏ చర్చించి, జాబితాను సిద్ధం చేశారు.


నిబంధనలు పాటించని శ్రీసత్యసాయి

క్రమబద్ధీకరణ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం ఆధారంగా ఆయా ప్రాంతాల్లోని రైతు సేవా కేంద్రాలకు ఆయా శాఖల రైతు సేవా కేంద్రం సిబ్బంది, ఎంపీఈఓల స్థానాలను ఇదివరకే కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో 323 మంది ఎంపీఈఓలు విధులు నిర్వర్తిస్తున్నారు. అనంత జిల్లాలో 189 మంది ఎంపీఈఓలు పని చేస్తుండగా.. 133 మందిని రైతు సేవా కేంద్రాలకు కేటాయించారు. మిగిలిన 56 మందిని పంటల విస్తీర్ణం ఎక్కువ కలిగిన ప్రాంతాల్లో నియమించాల్సి ఉంది. శ్రీసత్యసాయి జిల్లాలో 134 మంది ఎంపీఈఓలు ఉండగా.. 80 మందిని రైతు సేవా కేంద్రాలకు కేటాయించారు. మిగిలిన 54 మందిని పంటల సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నియమించాల్సి ఉంది. నిబంధనల మేరకు ఉమ్మడి జిల్లాకు సంబం ధించి అనంత జేడీఏ కార్యాలయంలోనే ఎంపీఈఓల సర్దుబాటుకు సమాలో చనలు జరపాల్సి ఉంది. అయితే శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన జేడీఏ, ఏడీఏలు సమావేశానికి హాజరుకాలేదు. శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓల సర్దుబాటుకు ఇప్పటి దాకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయ కార్యాలయంలో తమ జిల్లాకు చెందిన ఎంపీఈఓల సర్దుబాటు జాబితాను తయారు చేసుకుంటామని చెప్పినట్లు సమాచా రం. దీనిపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా నుంచి అనంత జిల్లాకు. అక్కడి నుంచి శ్రీసత్యసాయి జిల్లాకు వెళ్లేందుకు కొందరు ఎంపీఈఓలు మ్యూచ్‌వల్‌గా విన్నవించారు. ఉమ్మడి జిల్లాకు సంబం ధించి అనంత జేడీఏ కార్యాలయంలో ఒకే సారి ఎంపీఈఓల సర్దు బాటుపై జాబితాను తయారు చేసి ఉంటే.. స్థానాల కేటాయింపులపై సమస్యలు ఉండవని, శ్రీసత్యసాయి జిల్లా యంత్రాంగం వేరుగా జాబితా తయారు చేసుకుంటే స్థానాల కేటాయింపుల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కంప్యూటర్ ఆపరేటర్ ఆత్మహత్య

ధర్మవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోతుకుంట బ్రిడ్జి కింద మారుతీనగర్‌కు చెందిన మంచిరెడ్డి మోహన్‌రెడ్డి(45) గురువారం సాయంత్రం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు మృతుడు మోహన్‌రెడ్డి నల్లమాడ ఎమ్మార్వోలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసేవాడు. ఈయన మూడు నెలల కిందటే నల్లమాడకు వెళ్లారు. మంగళవారం పని నిమిత్తం ధర్మవరం వచ్చాడు. ఏం జరిగిందో ఏమో కానీ పోతుకుంట బ్రిడ్జి వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కీమెన్ సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య మాధవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు.

సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులు



సైబర్ నేరగాళ్లు చేసిన ఫోన్ నంబర్లు

బొమ్మనహాళ్, జూలై 24(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు డబ్బు దోపిడీకి కొత్త ఎత్తులు వేస్తున్నారు. వెలుగు కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామనీ, ఫోన్ పే ఓపెన్ చేయాలంటూ ఓ మాజీ సర్పంచ్‌కే మోసం చేయాలని ప్రయత్నించారు. ఆయన అప్రమత్తమవడంతో తప్పించుకున్నాడు. మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ మాజీ సర్పంచ్ మారుతీప్రసాద్‌ను గతేడాది సైబర్ నేరగాళ్లు మోసం చేసి, రూ.25 వేలు కొట్టేశారు. తాజాగా గురువారం 9991517668 నంబర్ నుంచి మారుతీప్రసాద్ ఫోన్‌కు కాల్ వచ్చింది. 'మీ అమ్మకు పెన్షన్ వచ్చిందనీ, బ్యాంకు లింక్ లేదనీ, మీ అకౌంట్‌కు వేస్తామనీ, ఖాతా నంబరు చెప్పాల'ని అడిగారు. వారి మాటలు నమ్మి మారుతీప్రసాద్ బ్యాంకు ఖాతా నంబర్ చెప్పారు. డబ్బు బదిలీ కావట్లేదనీ, ఫోన్ పేకి వేస్తామనీ, ఓపెన్ చేసుకోవాలన్నారు. మారుతీప్రసాద్‌కు అనుమానం వచ్చి మందలించి ఫోన్ కట్ చేశాడు. విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసుల విచారణలో సైబర్ నేరగాళ్ల నంబర్‌గా తేలింది. అకౌంట్‌లోని నగదును ట్రాన్స్‌ఫర్ చేసుకోవాలని పోలీసులు సూచించారు. గతంలో కూడా సైబర్ ఉచ్చులో పడి రూ.25 వేలు పోగొట్టుకున్నట్లు బాధితుడు మారుతిప్రసాద్ తెలిపారు.

భక్తులకు గమనిక..!

రేపటి నుంచి మంత్రాలయానికి కొత్త బస్సు సర్వీసు

ధర్మవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ధర్మవరం డిపో నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయానికి కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలోతెలిపారు. ఈ సర్వీసు ఈనెల 26న ఉదయం 5-15గంటలకు ప్రారంభిస్తామన్నారు. ఈ బస్సు అనంతపురం, గుత్తి, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు మీదుగా మంత్రాలయానికి 11గంటలకు చేరుకుంటుందన్నారు. తిరిగి మంత్రాలయంలో 11-30గంటలకు బయలుదేరి సాయంత్రం 5-15గంటలకు ధర్మవరం చేరుకుంటుందన్నారు.

చదువుతో అసమానతలు దూరం

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



విద్యార్థినికి నగదు పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

అనంతపురం టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): చదువుతోనే సమాజంలో అసమానతలు దూరమవుతాయని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన తొగట వీర క్షత్రియ విద్యార్థులకు గురువారం స్థానిక బెంగళూరు రోడ్డులోని తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో నగదు పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ.. చేనేత కులాలకు చెందిన ఎంతోమంది పిల్లలు ఉన్నత చదువులు చదివి వివిధ రంగాల్లో రాణిస్తున్నారన్నారు. పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం ఇటీవల పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ కల్యాణమండపం అధ్యక్షుడు దాసరి శ్రీధర్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, రామాంజప్ప, ప్రధాన కార్యదర్శి చింతా వెంకటేశ్వర్లు, కోశాధికారి చిదంబరయ్య, శేషయ్య, రూప ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

ధర్మవరం-షోలాపూర్ మధ్య ప్రత్యేక రైలు

గుంతకల్లు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ధర్మవరం-షోలాపూర్ మధ్య అప్ అండ్ డౌన్ సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. షోలాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ (01437) ఈ నెల 24న రాత్రి 11-20 గంటలకు షోలాపూర్‌లో బయల్దేరి 26న ఉదయం మూడున్నరకు ధర్మవరం చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (01438) ఈ నెల 26న ఉదయం ఆరున్నరకు ధర్మవరంలో బయల్దేరి ఆదివారం ఉదయం 10-45 గంటలకు షోలాపూర్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు కురుద్వాడి, బర్సి టౌన్, ధారాశివ్ లాతూర్, లాతూర్ రోడ్, ఉదయగిరి, భల్కి, బీదర్, హోమ్నాబాద్, వాడి, యాదగిరి, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, మదనపల్లి రోడ్డు, ములకలచెరువు, కదిరి స్టేషన్ల మీదుగా ధర్మవరం చేరుకుంటుందన్నారు.

చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17 వేలతో అమ్ముడుపోయాయని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయి. మార్కెట్‌కు 1230 టన్నుల చీనీకాయలు వచ్చాయి.

ఏసీబీ వలలో కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్

అనంతపురం క్రైం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఏసీబీ అధికారుల వలలో పెద్ద చేప పడింది. భారీగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కళ్యాణదుర్గం ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి అడ్డంగా దొరికిపోయారు. కళ్యాణదుర్గం మండలానికి చెందిన రియల్టర్ నాగేంద్ర నుంచి రూ.5 లక్షలు లంచం తీసుకుంటుండగా గురువారం రాత్రి ఏసీబీ అధికారులు దాడులు చేశారు. అనంతపురం నగరంలోని రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రియల్టర్ నాగేంద్ర ఒకటిన్నర ఎకరం వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ కోసం వెళ్లిన సమయంలో నారాయణస్వామి బేరసారాలకు దిగారు. అది అగ్రికల్చర్ ల్యాండ్ కాదని, మున్సిపాలిటీ పరిధిలో ఉన్నందున గజాల కింద చూపాల్సి వస్తుందని అన్నారు. దీనికి రిజిస్ట్రేషన్ ఫీజు ఎక్కువ అవుతుందని, తనకు రూ.5 లక్షలు ఇస్తే తగ్గిస్తానని లంచం అడిగారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. రిజిస్ట్రేషన్ పూర్తి అయిన తరువాత రూ.5 లక్షలు ఇస్తానని సబ్ రిజిస్ట్రార్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో ఈ నెల 17న ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. 18వ తేదీన డాక్యుమెంట్లు బాధితుడి చేతికి వచ్చాయి. అది మొదలు డబ్బుల కోసం సబ్ రిజిస్ట్రార్ ఫోన్‌లు చేయడం ప్రారంభించారు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు నాగేంద్ర ఆ సొమ్మును నారాయణస్వామికి గురువారం రాత్రి ఇచ్చారు. ఆ వెంటనే ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి ఆధ్వర్యంలో అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. డాక్యుమెంట్ల వెరిఫికేషన్ కోసం ఆయనను వెంటబెట్టుకుని కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి గురువారం రాత్రి 11 గంటల సమయంలో వెళ్లారు. సమగ్ర వివరాలను సేకరిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వలపన్ని సబ్ రిజిస్ట్రార్‌ను అరెస్టు చేశామని ఏసీబీ డీఎస్పీ ప్రశాంతి తెలిపారు.

వడ్డీ జలగల అరాచకాలు

- వారానికి నూటికి రూ.10 వడ్డీ
- అసలు కంటే ఎక్కువ రెట్లు చెల్లింపు
- ఇంకా.. ఇవ్వాలంటూ వేధింపులు
- ధర్మవరంలో రెండు చోట్ల దాడులు
- కేసులు నమోదు



ధర్మవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ జలగల అరాచకాలు తీవ్రమవుతున్నాయి. అడిగేవారెవరు, అడ్డుకునేవారెవరన్నట్లుగా పేట్రేగిపోతున్నారు. వారానికి నూటికి రూ.10 వడ్డీ వసూలు చేయడంతోపాటు, తీసుకున్న అప్పునకు మూడు, నాలుగు రెట్లు అధికంగా చెల్లించినా.. ఇంకా ఇవ్వాలంటూ వేధిస్తున్నారు. చెల్లిస్తామని వేడుకుంటున్నా వినకుండా ఏకంగా దాడులకు తెగబడుతున్నారు. ధర్మవరంలో వడ్డీ జలగల అరాచకాలపై బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

రెండు రెట్లకు పైగా చెల్లించినా..

పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన బసిరెడ్డిగారి ఆనందరెడ్డి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మేడాపురం రామయ్య వద్ద వారానికి నూటికి రూ.10 వడ్డీతో ఏడాదిన్నర క్రితం రూ.2.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఇప్పటికే రూ.1.50 లక్షలు వడ్డీకింద చెల్లించాడు. అసలు చెల్లించాలంటూ రామయ్య.. ఆనందరెడ్డిపై ఒత్తిడి తెచ్చాడు. దీంతో ఆనందరెడ్డి రూ.4.50 లక్షలు అప్పు తీసుకొచ్చి రామయ్యకు అసలు, వడ్డీ మొత్తం చెల్లించాడు. అయినా రామయ్య వడ్డీ దాహం తీరలేదు. తనకు ఇంకా చెల్లించాలంటూ ఆనందరెడ్డి ఇంటి వద్దకెళ్లి, అవమానించి బెదిరించాడు. ఈనెల 17వతేదీ ఆనందరెడ్డి కదిరి గేటు వైపు వెళ్తుండగా రామయ్య, అతడి కుమారులు ప్రదీప్, మంజు.. దాడి చేశారు. అటువైపు వెళ్తున్న రాజు, నరేశ్ విడిపించారు. దాడిపై ఆనందరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామయ్య, అతడి కుమారులు ప్రదీప్, మంజుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తండ్రి, కుమారుడిపై దాడి

శాంతినగర్‌లో రమణ, దేవరశెట్టి భారతి దంపతులు నివాసముంటున్నారు. రమణ ఎర్రగుంటకు చెందిన రాజుతో రూ.6.10 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. వారానికి నూటికి రూ.10 వడ్డీ ప్రకారం రూ.60వేలు చెల్లిస్తున్నాడు. రమణ పట్టుచీరల వ్యాపారం చేస్తుండగా.. ఆయన భార్య ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటివరకు వడ్డీ రూపంలో రూ.15 లక్షలు చెల్లించారు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందుల వల్ల మూడు నెలల నుంచి వడ్డీ కట్టలేకపోయారు. అప్పటి నుంచి రాజు.. రమణకు ఫోన్ చేసి, డబ్బు కట్టమని బెదిరించడంతోపాటు భయపెట్టేలాప్రవర్తించాడు. రమణ వ్యాపారం నిమిత్తం వేరే గ్రామానికి వెళ్లినపుడు ఇంట్లో భార్య భారతి ఒంటరిగా ఉన్న సమయంలో కాలింగ్‌బెల్ కొట్టడం, గేటు గ్రిల్ చప్పుడు చేయడం చేస్తూ అసభ్యకరంగా తిట్టి వెళ్లేవాడు. దీంతో రమణ భూమి అమ్మి డబ్బు కడతాననీ, తన ఇంటి వద్దకు రావద్దని చెప్పినా రాజు వినలేదు. ఇంటి వద్దకు వచ్చి చంపుతామని బెదిరింపులకు దిగేవాడు. ఈక్రమంలో రాజు.. తన అనుచరులను గురువారం రమణ ఇంటిపైకి పంపి బెదిరించాడు. రమణ, కుమారుడు చరణ్‌సాయిపై దాడి చేసి, వారి నుంచి రూ.7వేలు లాక్కున్నారు. రమణ కుటుంబసభ్యులు అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి అడ్డుకున్నారు. దీనిపై రమణ భార్య భారతి ఫిర్యాదుమేరకు ఎర్రగుంట రాజు, మహేశ్, వినోద్, మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

వలస బతుకు ఛిద్రం

- నెల కిందటే పెనుకొండకు బళ్లారి వాసి
- పంక్చర్ షాపు పెట్టుకుని జీవనం
- కంటైనర్ దూసుకురావడంతో దుర్మరణం
- కుమారుడికి గాయాలు



పంక్చర్ షాపుపైకి దూసుకెళ్లి బోల్తాపడిన కంటైనర్

బతుకుపోరు విషాదాంతమైంది..
వలస బతుకు ఛిద్రమైంది..
భార్యాబిడ్డలతో ఊరుగాని ఊరొచ్చాడు..
పంక్చర్‌షాపుతో జీవనం మొదలెట్టాడు..
నెల కూడా తిరగలేదు..
మృత్యువు దూసుకొచ్చింది..
రెప్పపాటులో ఆయువు తీసింది..
అక్కడే ఉన్న బిడ్డా గాయపడ్డాడు..
బతుకుబండి తల్లకిందులైంది..
పెద్దదిక్కు ప్రాణాలు పోయాయి..
భార్యాబిడ్డలు దిక్కులేని వారయ్యారు..

పెనుకొండ రూరల్, జూలై24(ఆంధ్రజ్యోతి): నెలరోజుల క్రితమే వలస వచ్చిన వ్యక్తి బతుకుపోరు అర్ధాంతరంగా ముగిసింది. మండలంలోని దుద్దేబండ క్రాస్ వద్ద జాతీయ రహదారి పక్కన పంక్చర్ షాపుపైకి గురువారం మధ్యాహ్నం కంటైనర్ దూసుకెళ్లడంతో ఫకృద్దీన్(36) దుర్మరణం చెందగా.. అతడి కుమారుడు మహ్మద్ ముస్తాక్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. కియ ఏఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన ఫకృద్దీన్ నెలరోజుల క్రితం పెనుకొండకు వలస వచ్చాడు. దర్గాపేటలో నివాసముంటూ దుద్దేబండ క్రాస్‌వద్ద జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డులో పంక్చర్‌షాపు ఏర్పాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం షాపు ముందు ఫకృద్దీన్ పనిలో నిమగ్నమై ఉన్నాడు. కుమారుడు మహ్మద్ ముస్తాక్ షాపు లోపల ఉన్నాడు. ఆ సమయంలో బెంగళూరు నుంచి కియ వైపు వెళ్తున్న కంటైనర్ అతివేగంతో అదుపుతప్పి సర్వీసురోడ్డులోని ఫకృద్దీన్ పంక్చర్ షాపుపైకి దూసుకెళ్లింది. ఫకృద్దీన్ పైనుంచి వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. షాపు పాక్షికంగా కూలడంతో మహ్మద్ ముస్తాక్ స్వల్పగాయాలతో బటయపడ్డాడు. వెంటనే కంటైనర్ డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. కుమారుడు మహ్మద్ ముస్తాక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. ఫకృద్దీన్‌కు భార్య ప్రహానా, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వారంతా పెద్దదిక్కును కోల్పోయి, రోడ్డున పడ్డారు.



ఫకృద్దీన్ (ఫైల్)

అధికంగా కృష్ణాజలాలు

కేటాయింపులకు మించి తీసుకుంటాం

జలవనరుల శాఖ సీఈ నాగరాజ, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజాస్వరూప్‌కుమార్



కృష్ణా జలాలకు హారతి ఇస్తున్న జలవనరుల శాఖ ఇంజనీర్లు

అనంతపురం క్లాక్‌టవర్/బెళుగుప్ప, జూలై24(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ ద్వారా కేటాయింపుల కంటే అధికంగా కృష్ణాజలాలు తీసుకుంటామని జలవనరుల శాఖ ప్రాజెక్ట్‌ల సీఈ నాగరాజ, హంద్రీనీవా ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్ తెలిపారు. జీడిపల్లి రిజర్వాయర్‌కి కృష్ణాజలాలు చేరడంతో గురువారం జిల్లా రైతులతో కలిసి జలవనరుల శాఖ, హంద్రీనీవా ఇంజనీర్లు ప్రత్యేక పూజలు చేశారు. రిజర్వాయర్ వద్ద జలహారతి ఇచ్చారు. అనంతరం ఇంజనీర్లను రైతులు సత్కరించారు. జలవనరుల శాఖ సీఈ నాగరాజ, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజాస్వరూప్‌కుమార్ మాట్లాడుతూ.. హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్‌తో నీటి వృథాను అరికడతామన్నారు. ఈనెల 17వతేదీన మల్యాల వద్ద నీటిని సీఎం చంద్రబాబునాయుడు విడుదల చేయగా... 22న జిల్లా సరిహద్దు రాగులపాడు వద్దకు కృష్ణాజలాలు చేరాయన్నారు. గురువారం జీడిపల్లికి చేరాయన్నారు. రాగులపాడు వద్ద మొదటిసారిగా 5 మోటార్లతో ఎత్తిపోతలను ప్రారంభించామని, జీడిపల్లి రిజర్వాయర్ 5 రోజుల్లో 5.5 టీఎంసీల వరకు వచ్చే నీటిని పీఏబీఆర్, ఎంపీఆర్‌కు విడుదల చేస్తామని తెలిపారు. జీడిపల్లి, గొల్లపల్లి, చెర్లోపల్లి, మారాల రిజర్వాయర్లతోపాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 165 చెరువులను కృష్ణా జలాలతో నింపుతామన్నారు. వేగంగా కావాల్సినంత నీటిని తీసుకుని ఆయా జలాశయాలు, చెరువుల్లో నీటి నిల్వ చేసుకునే వెసులుబాటు లభించిందన్నారు. రాబోయే రోజుల్లో రెండు పంటలకు సాగునీరు వచ్చే అవకాశం ఉందన్నారు. కేటాయించిన నీటి కంటే ఎక్కువగా తీసుకునే అవకాశం దక్కడం శుభపరిణామమన్నారు. మల్యాల నుంచి 3,400 క్యూసెక్కుల నీటిని తీసుకువచ్చి రాయలసీమను సస్యశ్యామలం చేయడం ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు రామకృష్ణయాదవ్, రామకృష్ణ, రమణ, పృథ్వీ సర్పంచ్ వెంకటనాయుడు, దుద్దేకుంట తిమ్మప్ప, నరేంద్ర, దామోదర్, తిమ్మప్ప, పురుషోత్తం పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవిని దర్శించుకున్న సినీనటుడు శ్రీకాంత్ దంపతులు



అలంకరణలో అమ్మవారు

తాడిపత్రి, జూలై24(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంటపల్లిలో వెలసిన శ్రీ చౌడేశ్వరీ దేవిని గురువారం సినీనటుడు శ్రీకాంత్, ఊహ దంపతులు దర్శించుకున్నారు. అమ్మవారి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేయించారు. అమ్మవారి ఉపాసకుడు వీరేష్ స్వామి.. శ్రీకాంత్ దంపతులకు శాలువా కప్పి, సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



శ్రీకాంత్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

అభివృద్ధి ప్రాజెక్టులకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

అనంతపురం జూలై 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం సచివాలయంలో మంత్రిమండలి సమావేశం జరిగింది. అందులో ఆరోఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ (గతంలో అరబిందో రియాల్టీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్)కు కేటాయించిన 800 మెగా వాట్ల శింగనమల పీఎస్‌పీ కెపాసిటీ ప్రాజెక్టు రద్దుకు చేసిన ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. జేఎస్‌డబ్ల్యూనియో ఎనర్జీ లిమిటెడ్ అభ్యర్థన మేరకు వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు బదులుగా శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం సున్నపురాళ్లపల్లి, ఇతర గ్రామాల్లో 1450 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం ఆర్.అనంతపురం గ్రామంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. దీంతోపాటు ఏపీఐఐసీ ద్వారా వివిధ సర్వే నెంబర్లలో 439.27 ఎకరాల భూమిని ఉచితంగా కేటాయించాలని రెవెన్యూ శాఖ చేసిన ప్రతిపాదనలకు ఆమోద ముద్ర వేసింది.

టమోటా కిలో రూ.34

అనంతపురం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో గురువారం కిలో టామోటాల ధర గరిష్ఠంగా రూ.34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.17, సరాసరి ధర రూ.25తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,750 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి కేంద్ర బృందం పర్యటన: కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణాభివృద్ధి పనుల పరిశీలన కోసం శుక్రవారం నుంచి ఆగస్టు 1వరకు కేంద్ర బృందం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులపై కేంద్ర బృందం సభ్యుడు దయాకర్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రం బృందం సభ్యులు 25 నుంచి ఆగస్టు 1వరకు అమరాపురం, గాండ్లపెంట, రామగిరి మండలాల్లోని 8 గ్రామ పంచాయతీల్లో పర్యటిస్తారన్నారు. కేంద్ర బృందం గ్రామీణాభివృద్ధి పనులపై లబ్ధిదారులతో సమావేశం అవుతుందన్నారు. ప్రధానంగా ఉపాధి హామీ పథకం, పింఛన్ల పంపిణీ, మహిళా సంఘాల పనితీరు, హౌసింగ్, వాటర్‌షెడ్, తదితర పథకాల అమలుపై పరిశీలిస్తారన్నారు. కేంద్ర బృందం సభ్యులకు స్థానిక అధికారులు సహకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, డీపీఓ సమత తదితరులున్నారు.

రిటైర్డ్ ఏఎస్ఐ దౌర్జన్యం

● పొలం విషయంలో గొడవ ● కొడవలితో దాడి.. ఇద్దరికి గాయాలు



కొడవలితో బెదిరిస్తున్న రిటైర్డ్ ఏఎస్ఐ కృష్ణకుమార్

బెళుగుప్ప, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఏఎస్ఐ దౌర్జన్యానికి దిగాడు. వేటకొడవలితో బీభత్సం సృష్టించాడు. మండలంలోని ఆవులెన్న గ్రామంలో గురువారం పొలం విషయమై ఇద్దరిపై కొడవలితో దాడి చేయడంతో వారు ఆస్పత్రి పాలయ్యారు. ఎస్ఐ శివ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆవులెన్నకు చెందిన రైతు నాగరాజు, రిటైర్డ్ ఏఎస్ఐ కృష్ణకుమార్ మధ్య సర్వే నంబరు 97.98లో పొలం విషయమై వివాదం ఉంది. అధికారులు సర్వే చేసి హద్దులు కూడా ఏర్పాటు చేశారు. 24 సెంట్ల విషయంలో మాత్రమే వివాదం ఉంది. ఈ నేపథ్యంలో రైతు నాగరాజు గురువారం కుటుంబ సభ్యులతో కలిసి కంది విత్తేందుకు వెళ్లాడు. అనంతపురంలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఏఎస్ఐ కృష్ణకుమార్ కొడవలితో ఆగ్రహంగా వచ్చాడు. రైతు నాగరాజు భార్య నాగలక్ష్మి, విత్తనం వేసేందుకు వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్ అశోక్‌పై దాడి చేశాడు. వారికి గాయాలవడంతో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడిపై బాధితులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

24 మందికి ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి

ఉత్తర్వులు జారీ చేసిన డీఐజీ ప్రవీణ్

అనంతపురం క్రైం, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 24 మంది ఏఎస్ఐలకు ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి లభించింది. జోన్-4 పరిధిలోని అనంతపురం, కర్నూలు జిల్లాల్లో పలువురికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి వేర్వేరు జిల్లాల్లో పోస్టింగ్ ఇచ్చారు. ఉద్యోగోన్నతి పొందినవారిలో జిల్లాకు చెందిన రామచంద్రారెడ్డి, రాజశేఖర్, ఎం.రామక్రిష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్‌కి కర్నూలు జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. శ్రీనివాసగౌడ్, షఫీవుల్లా, వై.రామక్రిష్ణారెడ్డి, రామాంజినేయులు, సంపత్ కుమార్‌కి నంద్యాల జిల్లా, అశ్వత్థనారాయణరెడ్డి, వేణుచారి, శ్రీనివాసులు, సుధాకర్ రెడ్డి, రామమోహన్, కిష్టప్ప, త్రిలోక్‌నాథ్, నాగేశ్వర్‌రెడ్డి, షేక్షావలి, నాగరాజును తిరుపతి జిల్లాకు, రామాంజినేయులు, రమేష్, సూర్యనారాయణ, నారాయణరెడ్డికి అన్నమయ్య జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. ఉత్తర్వులు అందుకున్న 15 రోజుల్లో విధుల్లో చేరాలని డీఐజీ ఆదేశించారు. ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి పొందినవారు ఎస్పీ జగదీష్‌ని శుక్రవారం కలవనున్నారని సమాచారం.

అహుడా పనులను వేగవంతం చేయాలి

- జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, జూలై 24(ఆంధ్రజ్యోతి): అహుడా పరిధిలో ఉన్న పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌తో కలిసి అహుడా పనితీరుపై సమీక్షించారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని ఎంఐజీ లేఅవుట్ల భూ ముల సేకరణ పనులు వేగవంతం చేయాలన్నారు. పెండింగ్ పనులను పరిశీలించి, అవసరమైన మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం తర్వాత ప్రజలు నివసించడానికి అనువైన మౌలిక సదుపాయాలు అందించగలిగే భూములను గుర్తించాలన్నారు. పెనుకొండ, ధర్మవరం, మడకశిర, గుత్తి, కూడేరు, కందుకూరు ప్రాంతాల్లో లేఅవుట్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ అధికారి ఇషాక్, ఈఈ దుష్యంత్, జేపీఓ హరీష్ పాల్గొన్నారు.

జర్మనీలో నర్సు ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

పుట్టపర్తి రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): జర్మనీలో నర్సు ఉద్యోగాల కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి శివరంగప్రసాద్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 35ఏళ్లలోపు వయసు, బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసి రెండేళ్ల క్లినికల్ అనుభవం కలిగిన, జీఎన్ఎం నర్సింగ్ పూర్తి చేసి, మూడేళ్ల అనుభవం ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి తిరుపతి, విశాఖపట్టణం, గుంటూరులో గిరిజన, సాంఘిక సంక్షేమశాఖల ఆధ్వర్యంలో జర్మన్ భాషపై 8 నుంచి 10 నెలలపాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఈనెల 29వతేదీలోపు dsweo.sss@gmail.com కి మెయిల్ ద్వారా కానీ, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 7981333346 నంబరులో సంప్రదించాలన్నారు.

న్యూస్ బాక్స్

డిగ్రీ కళాశాల భవనం పూర్తి చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

బుక్కపట్నం, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనానికి నిధులు మంజూరుచేసి, భవనం పూర్తి చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున డిమాండ్ చేశారు. ఆయన గురువారం కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి, స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ నరసింహులుకు వినతిపత్రం అందించారు. మండలకేంద్రంలో దాదాపు ఏడుళ్ల క్రితం కళాశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించినా, బిల్లులు రాకపోవడంతో భవనం అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు.

డీలర్ల సంఘం మండల అధ్యక్షుడిగా రాజారెడ్డి



పిట్టా రాజారెడ్డిని సన్మానిస్తున్న డీలర్లు

ఓబుళదేవరచెరువు, జూలై 24(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడిగా ఓడీచెరువుకు చెందిన పిట్టా రాజారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మండల డీలర్ల సంఘం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా పిట్టా రాజారెడ్డి, ఉపాధ్యక్షుడిగా డి. షమూన్, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్‌రెడ్డి, కోశాధికారిగా బాబాఫక్రుద్దీన్, కార్యదర్శులుగా తంగేడుకుంట డ్రిప్ నాగరాజు, రాజు, దొన్నికోటవారిపల్లి బొమ్మరాజు, మిట్టపల్లి నాగేంద్రను ఎన్ను కున్నారు. ఎన్నికైన సభ్యులను సన్మానించారు.

అన్న క్యాంటీన్ పరిశీలన

ధర్మవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను గురువారం ఉదయం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ పరిశీలించారు. క్యాంటీన్‌లో అల్పాహారాన్ని పరిశీలించారు. అనంతరం అల్పాహారం చేస్తున్న వారి వద్దకు వెళ్లి రుచి, నాణ్యత గురించి ఆరాతీశారు. ప్రజలకు నాణ్యమైన భోజనం, అల్పాహారాన్ని అందించాలని ఆయన అన్నక్యాంటీన్ సిబ్బందికి సూచించారు.

సమస్యలపై ఆర్డీఓ విచారణ

ముదిగుబ్బ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ధర్మవరం ఆర్డీఓ మహేష్ గురువారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. రస్తా వివాదాలు, భూసమస్యలపై విచారణకు ఆయన గుడ్డంపల్లి తండా, మంగళమడక, కొండగట్టుపల్లి గ్రామాల్లో పర్యటించారు. సమస్యలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణస్వామి, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా అబ్బాయి ఆచూకీ తెలపండి

● పోలీసులకు తండ్రి ఫిర్యాదు



ప్రశాంత్‌కుమార్ (ఫైల్)

కొత్తచెరువు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడు గజ్జి ప్రశాంత్ కుమార్ కనబడటం లేదని మండలంలోని నారేపల్లి గ్రామానికి చెందిన గజ్జి కిష్టప్ప ఫిర్యాదు చేశాడని సీఐ మారుతీ శంకర్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు బీటెక్‌లో చేరడానికి ఈనెల 19న ప్రశాంత్ కుమార్ మాచర్ల బయల్దే రాడన్నారు. నాలుగు రోజులు కావస్తున్నా ఇంటికి రాలేదన్నారు. బంధువులు, స్నేహితులను అడిగినా సమాచారం లేకపోవడతో పోలీసులను ఆశ్రయించాడన్నారు. ఇంటి నుంచి వెళ్లేటపుడు ఆకుపచ్చ రంగు చొక్కా, నలుపు రంగు కాటన్ ప్యాంట్ వెసుకున్నట్లు తెలిపా డన్నారు. గజ్జి కిష్టప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గొట్లూరు సర్పంచ్‌కు మంత్రి అభినందన



సర్పంచ్ నరసమ్మను సన్మానిస్తున్న బీజేపీ నాయకుడు హరీష్‌బాబు

ధర్మవరం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు ఉత్తమ పంచాయితీగా ఎంపికై, ఆ గ్రామ సర్పంచ్ పిట్టా నరసమ్మకు ఈ ఏడాది ఆగస్టు 15న ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరుగనున్న స్వాతంత్రదినోత్సవాల్లో పాల్గొనే అరుదైన అవకాశం దక్కింది. గురువారం సాయంత్రం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు నాయకులతో కలిసి గ్రామానికి వెళ్లి సర్పంచ్ పిట్టా నరసమ్మను కలిశారు. మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఫోన్ ద్వారా ఆమెకు అభినందనలు తెలిపారు. మీలాంటి ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధికి స్ఫూర్తి కావాలని, ధర్మవరం ప్రజల తరఫున గర్వంగా భావిస్తున్నామన్నారు. అనంతరం ఆమెను హరీష్‌బాబు, నాయకులు ఘనంగా శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

పథకాలపై రైతులకు అవగాహన కల్పించండి

బుక్కపట్నం, జూలై 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రైతు సంక్షేమపథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని రైతు సేవాకేంద్రం సిబ్బందికి ఏఓ నటరాజ్ సూచించారు. ఆయన గురువారం మండలకేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది, ఎంపీఈఓలకు రైతు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.

డి.చెర్లోపల్లిని పరిశీలించిన కేంద్ర బృందం

బత్తలపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని డి చెర్లోపల్లిలో గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కేంద్ర బృందం సభ్యులు రామచంద్ర, శ్రీనివాసులు, సాయినాథ్‌బాబు గురువారం పర్యటించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామ సచివాలయం, చెత్తతో సంపద కేంద్ర తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహనాయుడు, డిప్యూటీ ఎంపీడీఓ క్రిష్టప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి, సర్పంచ్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి

బత్తలపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గంటాపురం గ్రామములో గురువారం కుక్కల దాడిలో 16 గొర్రె పిల్లలు మృతి చెందాయి. గంటాపురానికి చెందిన పెద్దన్న గొర్రెలు మేపుతూ జీవనం సాగించే వాడు. రోజుమాదిరిగానే గొర్రెల పిల్లలను గ్రామ సమీపంలో గూడులో ఉంచి గొర్రెలను మేతకు తోలుకెళ్లాడు. ఎవరూ లేని సమయంలో కుక్కలు గూడులోకి చొరబడి 16 పిల్లలను చంపేశాయి. సాయంకాలం వచ్చి చూసే సరికి గూడులో ఉన్న పిల్లలు కుక్కల దాడిలో చనిపోయి కనిపించాయి. దీంతో రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.



అలంకరణలో కొత్తపేట చౌడేశ్వరి



మల్కాపురంలో...



కదిరిలో...



తనకల్లులో....

ఘనంగా చౌడేశ్వరి జయంతి

ధర్మవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌడేశ్వరిదేవి ఆలయాల్లో గురువారం అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొత్తపేటలోని చౌడేశ్వరిదేవి, తొగటవీధిలోని శాంతకళా చౌడేశ్వరి దేవి, గాంధీనగర్, గీతానగర్‌లోని ఆలయాల్లో మూల విరాట్లను నూతన పట్టు వస్త్రాలు, వివిధ రకాలపూలు, వేపాకులతో అలంకరించి పూజలు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

● ధర్మవరంరూరల్: మండలంలోని మల్కాపురం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలుచేశారు. మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం, అన్నదానం చేపట్టారు.

● కదిరి అర్బన్: పట్టణంలోని మదనపల్లి రోడ్డులో వెలసిన చౌడేశ్వరీ ఆలయంలో ఉదయం గణపతి, లక్ష్మి, సరస్వతి, విగ్రహాలకు అభిషేకం, అర్చనలు చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

● నంబులపూలకుంట: మండలంలోని ఎస్సీకుంట, పి.కొత్తపల్లి, పెడబల్లి, తూర్పునడింపల్లి చౌడమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు బోనాలు, జ్యోతులు సమర్పించారు.

● తనకల్లు: దేశాయి రెడ్ల ఆడబిడ్డగా, కోరిన కోర్కెలు తీర్చే అమ్మగా ప్రసిద్ధి చెందిన చౌడేశ్వరీదేవికి మండలకేంద్రంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. అన్నదానం నిర్వహించారు. దేశాయి రమణారెడ్డి, కరు ణాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, భక్తవత్సలరెడ్డి, రాజారెడ్డి, శ్రీకంఠరెడ్డి, పలువురు మండలంలోని భక్తులు పాల్గొన్నారు.



నంబులపూలకుంటలో అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం



బొంతలపల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

'సుపరిపాలనలో తొలి అడుగు'లో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ధ్యేయమని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. ఆమె గురువారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని బొంతలపల్లిలో ఇంటింటా పర్యటించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకి గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ.. వైసీపీ ఐదేళ్ల పాలనలో అధోగతిపాలైన రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన అందించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను 90శాతం తు.చ. తప్పకుండా అమలుచేశామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమపథకాలను అందజేస్తున్నామని తెలిపారు. సింగిల్‌విండో అధ్యక్షుడు విజయ్‌కుమార్, సర్పంచు శ్రీనివాసులు, వెంగళమ్మచెరువు సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీరామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే శుక్రవారం బుక్కపట్నం మండలం మారాల గ్రామంలో పర్యటించన్నున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు.



● నల్లమాడ: మండలంలోని చంద్రాయునిపల్లి, పాతబత్తపల్లి, ఆది ఆంధ్రాపల్లి, కొత్త బత్తలపల్లిల్లో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్, సింగల్‌విండో అధ్యక్షుడు గడ్డం రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కోట్లో మంజునాథ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అరవింద్, మణికుమారి, రాజారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం మా బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

● నేటి నుంచి 'మీ సమస్య - మా బాధ్యత'
● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్

ధర్మవరం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజాసమస్యలను పరిష్కరిం చడం తమ బాధ్యతని టీడీపీ నియోజకవర్గ ఇన్ చార్జ్ పరిటాలశ్రీరామ్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజ ల నుంచి వినతుల స్వీకరించడానికి సచివాలయాల పరిధిలో గ్రీవెన్స్ ని ర్వహించడపై గురువారం స్థానిక పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో రూరల్ పరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశ మయ్యారు. 'మీ సమస్య-మా బాధ్యత' అనే పేరుతో శుక్రవారం 7, 8 వార్డుల నుంచి గ్రీవెన్స్‌కు శ్రీకారం చుడతామన్నారు. ముందుగా శివాన గర్‌లోని శివాలయంలో పూజలు చేసి ఏడు కొళాయిల పార్కు వద్ద వినతులు స్వీకరిస్తామన్నారు. ఈ మేరకు నియోజకవర్గంలోని పట్టణంతోపాటు నాలుగు మండలాల్లో ప్రజల వద్ద నుంచి ఆర్జీలు స్వీకరి స్తామన్నారు. సచివాలయ సిబ్బంది, మున్సిపల్ అన్ని విభాగాల అధి కారులు వస్తారని, అక్కడికక్కడే పరిష్కారం చూపుతారని తెలిపారు. నాడు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అడిగామని, నేడు ప్రజల సమస్యలు తీర్చాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఏ సచివాలయ పరిధిలో గ్రీవెన్స్ నిర్వహిస్తామో ముందుగానే దండోరా వేయించి, వీలైనంత ఎక్కువమంది నుంచి ఆర్జీలు స్వీకరించాలని నిర్ణయించామన్నారు. ఇందుకు నాయకులు, కార్యకర్తలు ముందుకురావాలని పిలుపునిచ్చారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

● ధర్మవరం: ప్రజలు కష్టాల్లో ఉన్నారంటే ముందుగా స్పందించే నాయకుడు సీఎం చంద్రబాబునాయుడు మాత్రమేనని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. ధర్మవరంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం నియోజక వర్గంలోని 13 మందికి మంజూరైన రూ.5.80లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పరిటాల శ్రీరామ్ వారికి అందజేశారు.

కుమ్మక్కై వైసీపీకి కొమ్ముకాస్తారా..?

● రెవెన్యూ అధికారులతో బాధిత రైతుల వాగ్వాదం



అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు

బత్తలపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): మా భూములు లాక్కుని, సాగు చేసుకుంటున్న వైసీపీ నాయకులతో కుమ్మక్కై, వారికి అనుకూలంగా నివేదికలు ఇస్తారా? అంటూ పలువురు రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత రైతులు టీడీపీ నాయకులతో కలిసి గురువారం తహసీల్దార్ కార్యాలయం చేరుకుని అధికారులతో వాగ్వాదానికి దిగారు. బాధిత రైతులు తెలిపిన మేరకు.. ఎం. చెర్లోపల్లి గ్రామ సమీపంలో సర్వే నెంబర్ 31-6లో గ్రామానికి చెందిన నారాయణమ్మ 4.86, గంగాదేవిలకు 3.12 ఎకరాలకు ప్రభుత్వం డి.పట్టా ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామానికి చెందిన ఆ పార్టీ నాయకులు ఆ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు. ఈ విషయమై బాధితులు గత నెల 16న గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును కలెక్టరేట్ అధికారులు బత్తలపల్లి తహసీల్దార్‌కు ఫార్వర్డ్ చేశారు. మండల సర్వేయర్ జోసఫ్, విలేజ్ సర్వేయర్ నారాయణస్వామి, వీఆర్‌ఓ సాయి కలిసి ఈ నెల 30న వైసీపీ నాయకులు కబ్జా చేసిన భూమిని పరిశీలించి, నివేదికను తహసీల్దార్ స్వర్ణలతకు అందించారు. దీనిపై తహసీల్దార్ ఎండార్స్‌మెంటు తయారు చేసి ఫిర్యాదుదారులకు, కబ్జా చేసిన వారికి ఇవ్వమని విలేజ్ సర్వేయర్‌కు కాపీలను ఇచ్చారు. వాటిని కబ్జా చేసిన వారికి మాత్రమే ఇచ్చారు. ఇది తెలుసుకున్న బాధితులు భగ్గుమన్నారు. తహసీల్దార్ కార్యాలయం చేరుకుని వాగ్వాదానికి దిగారు.

మాకు అన్యా యం చేస్తే తహసీల్దార్ ఆఫీసు ఎదుటే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. సర్వేర్ జోసఫ్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫీల్డ్ విజిట్ చేసి, ఉన్న విషయాలను నివేదికలో చేర్చామని తెలిపారు. రికార్డుల్లో ఫిర్యాదుదారులే ఉన్నట్లు నివేదిక ఇచ్చామన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ స్వర్ణలత మాట్లాడుతూ రెండు రోజులలో తాను మండల సర్వేయర్, విలేజ్ సర్వేయర్, వీఆర్‌ఓలతో కలిసి పొలాన్ని పరిశీలిస్తానని తెలిపారు దీంతో బాధితులు వెనుదిరిగారు. టీడీపీ నాయకులు నెట్టెం రమణ, సురేంద్ర, సదాశివ, కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు రాలేదని మహిళల నిరసన



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

ధర్మవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్ గ్యాస్ గోడౌన్ ప్రాంతంలో రెండు నెలలుగా తాగునీరు సక్రమంగా రావడంలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మట్లాడుతూ... రెండు నెలల నుంచి ఐదారు రోజులకొకసారి తాగు నీరు వస్తోందని, అది కూడా చిన్నగా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోటార్లు వేసినా నీరు సరిగా అందడంలేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. గతంలో కనీసం చేతిపంపులైన ఉండేవని, కొళాయి నీరు రానప్పుడు వాటి నుంచి తెచ్చుకునే వాళ్లమన్నారు. ప్రస్తుతం అవి కూడా లేవన్నారు. ఈ విషయం మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బందికి, నాయకులకు విన్నవించిన పట్టించుకోలేదని వాపోయారు. తమ ప్రాంతానికి తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని మహిళలు కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ వద్దకు వెళ్లి తాగునీటి సమస్య విన్నవించగా, వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన తెలపడంతో వెనుదిరిగివెళ్లారు.

● కొత్తచెరువు: మండల కేంద్రం సమీపంలోని నాగిరెడ్డిపల్లిలో కాలనీ ప్రాంతానికి తాగునీరు సరఫరా కాలేదంటూ స్థానిక మహిళలు ఖాళీ బిందెలతో ప్రధాన రహదారిపై గురువారం నిరసన తెలిపారు. తాగునీటి బోరుకు ఉన్న విద్యుత్ వైరు తెగిపోవడంతో 20 రోజుల నుంచి తమ కాలనీకి తాగునీరు సరఫరా కాలేదన్నారు. పలు మార్లు పంచాయతీ అధికారులకు, విద్యుత్ సిబ్బందికి తెలిపిన పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కరెంటు లైన్‌ను పునరుద్ధరించి తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని వారు కోరారు.



నాగిరెడ్డిపల్లి కాలనీలో ఖాళీ బిందెలతో...

నేడు సోమయాజులపల్లికి ఎమ్మెల్యే రాక

గాండ్లపెంట, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజులపల్లి పంచాయతీలో శుక్రవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ కొండయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సోమయాజులపల్లి పంచాయతీలో రచ్చ బండ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరవుతారన్నారు. అన్నిశాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

'సెల్‌టవర్లు ఏర్పాటు చేయండి'

నల్లమాడ, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాలా గ్రామాల్లో సెల్ టవర్లు లేకపోవ డంతో నెట్‌వర్క్ సరిగా అందక సెల్ ఫోన్లలో మాట్లాడేందుకు ఇబ్బందిగా ఉందని ఆయా గ్రామాల నాయకులు పేర్కొన్నారు. వారు గురువారం మండలకేంద్రంలోని సలాంఖాన్ నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని చౌటకుంటపల్లి, బొగ్గలపల్లి, రామాపురం, మీసాల వాండ్లపల్లి, కుటాలపల్లి తదితర గ్రామాల్లో సెల్‌టవర్లు లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో చౌకదుకాణాల్లో బియ్యం తీసుకోలన్నా, సాఫ్ట్‌వేర్లు వర్క్‌ఫ్రమ్ హోం చేయాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డికి వినతిపత్రం అందించామన్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి, సెల్‌టవర్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకలు మైలే శివశంకర్, సింగల్‌విండో అధ్యక్షుడు రమణారెడ్డి, కేశవరెడ్డి, వెంకటరమణ, సలాంఖాన్, బుట్టి నాగభూషణ నాయుడు, సోముశేఖర్‌రెడ్డి, అరవిందు తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని మేలుకొల్పేవారే వైతాళికులు

● డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్



ప్రపంచ మానవాళి మహానేస్తాలు చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్

ధర్మవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని మేలుకొల్పేవారే వైతాళికులు అని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమాజాభివృద్ధికి కొత్తబాటలు వేసిన 102 మంది ప్రపంచ మేధావులతో కూడిన వైతాళికుల చిత్రపటాన్ని ఆయన గురువారం ఆవిష్కరించారు. చిత్రపటాన్ని అదే కళాశాలలో పనిచేస్తున్న రాజనీతి శాస్త్ర అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గోపాల్ నాయక్ కళాశాలకు బహూకరించారు.

'సేవ్ ఆర్టీటీ ' పై పోస్టుకార్డుల ఉద్యమం

కొత్తచెరువు, జూలై 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆర్టీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాలని మండల కేంద్రంలోని బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థులు గురువారం పోస్టుకార్డుల ఉద్యమం నిర్వహించారు. ఆర్టీటీ పరిరక్షణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా చేపడుతున్నట్లు సామాజిక వేత్త ఓం ప్రకాశ్‌తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లీక్ అవుతున్న ట్యాంక్‌కు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి స్పందన

తనకల్లు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాకుంటపల్లిలో ట్యాంక్‌కు అధికారులు మరమ్మతులు చేపట్టారు. టాంక్‌నీరు లీక్ అయి పాఠశాల పక్కనే ఉన్న దిబ్బల్లోకి చేరి కుళ్లి కంపుకొడుతోందని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్ర జ్యోతి దినపత్రిలో గురువారం వార్త ప్రచురితమైన విషయం విదితమే. ఈ వార్తకు స్పందిం చిన వైద్యఆరోగ్యశాఖాధికారులు గ్రామానికెళ్లి, పాఠశాల పక్కన కుళ్లిన దిబ్బలను శుభ్రం చేయించారు. అలాగే ట్యాంక్‌కు మరమ్మతులు చేయాలని సర్పంచ్ నాగేంద్ర, కార్యదర్శికి సూచించారు. ట్యాంక్ వద్ద, పాఠశాల ఆవరణం, దిబ్బలపైన బ్లీచింగ్ చల్లారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. దోమకాటును నివారించాలని అవగాహన కల్పించారు. దోమ కాటువలన డెంగీ, మలేరియా సోకుతుందన్నారు. కార్యక్రమంలో మలేరియా తూర్పు యూనిట్ సూపర్‌వైజర్ మహ బూబ్‌బాషా, సూర్యనారాయణరెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ చేయిచేసుకోవడంతో
స్పృహ తప్పిన బాలుడు



స్పృహలోలేని నిషాంత్‌ను చూపుతున్న తండ్రి చిరంజీవి

ధర్మవరం రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగా థియేటర్‌లో బుధవారం అర్ధరాత్రి హరిహరవీరమల్లు సినిమా చూస్తున్న నిషాంత్ అనే 14ఏళ్ల బాలుడిపై ఓ హెడ్ కానిస్టేబుల్ చేయిచేసుకోవడంతో స్పృహ కోల్పోయాడు. మండలంలోని గొట్లూరుకు చెందిన బాలుడు నిషాంత్ తండ్రి గొడ్డిటి చిరంజీవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిరంజీవి తన కుమారుడు నిషాంత్‌తో కలిసి హరిహరవీరమల్లు సినిమాకు పట్టణంలోని రంగా థియేటర్‌కు వెళ్లారు. బుధవారం అర్ధరాత్రి సినిమా చూస్తుండగా అభిమానులు సినిమా హాల్‌లో ఉన్న అగ్నిమాపక పరికరాన్ని ఆన్‌చేశారు. హాల్‌లో పొగ కమ్ముకోవడంతో ఇద్దరూ బయటకు వచ్చామన్నారు. పొగ తగ్గాక థియేటర్‌లోకి వెళ్లారు. అప్పటికే వారి సీట్లలో వేరేవాళ్లు కూర్చున్నారు. దీంతో నిషాంత్ నిల్చొని సినిమా చూస్తున్నాడు. అదేసమయంలో థియేటర్‌లోకి వచ్చిన వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ చెంపమీద బలంగా కొట్టడంతో సినిమా హాల్‌లోనే నిషాంత్ స్పృహతపి పడిపోయాడు. వెంటనే గ్రామస్థులతో కలిసి బాలుడిని పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఎంతసేపటికి స్పృహలోకి రాకపోవడంతో అనంతపురం తరలించారు. అక్కడ చికిత్సలు చేయించి ఇంటికి వచ్చా రు. అయినా సరిగ్గా స్పృహలోకి రాలేకపోతున్నాడని బాలుడు తండ్రి ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై పట్టణ వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్‌ను అడగ్గా థియేటర్‌లో జనం అధికంగా ఉండటంతో తోపులాటలో కిందపడి స్పృహకోల్పోయాడని తెలిపారు.

తప్పులు లేకుండా సర్వే చేయండి : ఏడీ

బత్తలపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక పశువైద్యశాలలో గురువారం బత్తలపల్లి, తాడిమర్రి విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్లకు బ్లాంకెట్ సర్వేపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ శ్రీనివాసులు మాట్లాడుతూ... శుక్రవారం నుంచి సెప్టెంబర్ 15 వరకు బ్లాంకెట్ సర్వే ఉంటుందని, పశుపోషణ జీవనోపాధిగా ఉన్న కుటుంబాలకు ఈ ప్ర భుత్వంలో ఏఏ పథకాలు చేరాయి తదితర అంశాల సర్వే చేయాలని సూచించారు.

స్వచ్ఛతా కార్యక్రమం

● నంబులపూలకుంట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణం చుట్టూ పేరుకు పోయిన చెత్త చెదారాన్ని గురువారం శుభ్రం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్ పేర్కొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి
నేడు భూమిపూజ

తీరనున్న తమ్మినాయనపల్లి గ్రామస్థుల కల



బురదమయంగా ఉన్న దేమకేతేపల్లి నుంచి తమ్మినాయనిపల్లికి వెళ్లే రోడ్డు

చిలమత్తూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేక నరకయాతన పడ్డారు తమ్మినాయనపల్లి వాసులు. గ్రామం నుంచి బయటకు వెళ్లాలంటే దారి పొడవునా గుంతలే. వర్షం వస్తే ప్రయాణం నరక ప్రాయం. గ్రామానికి రోడ్డు కావాలని ఊరు ఊరంతా కలిసి కట్టుగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాలకులను, అధికారులను వేడుకున్నా ఫలితం దక్కలేదు. చివరికి పలు దఫాలుగా ఆందోళనలు చేశారు. ఆ సమయంలో ఇదిగో రోడ్డు అంటూ వారు కాలంగడిపారు. అయితే ఆ ప్రాంతవాసుల కష్టాలను చూసి ఎన్నికల సమయంలో బాలకృష్ణ రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆ హామీని ఆయన నిలబెట్టుకున్నారు. ఆ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించేందుకు నేడు ఆయన సతీమణి వసుంధర దేవి భూమిపూజ చేయనున్నారు. కోటి రూపాయలతో సీసీ రోడ్డు ఏర్పాటుకానుంది. దీంతో తమ్మినాయనిపల్లి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఖైదీల ఆరోగ్యంపట్ల జాగ్రత్త వహించండి

జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్ భీమారావు



సబ్‌జైలును తనిఖీ చేస్తున్న భీమారావు

పెనుకొండ టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఖైదీల ఆరోగ్య రక్షణపై జాగ్రత్త వహించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ భీమారావు పేర్కొన్నారు. గురువారం పెనుకొండ సబ్‌జైలును తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఖైదీల సౌకర్యాలపై వసతులపై ఆరాతీశారు. అనంతరం ఖైదీలతో భోజన సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి న్యాయసహాయమైనా అందిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయాధికారులు వాసుదేవన్, బొజ్జప్ప, రాకేష్, సబ్‌జైలు సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి: కమిషనర్

హిందూపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని, ఇందుకు దుకాణాల యజమానులు సిబ్బంది కృషిచేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని ట్రేడర్స్ షాపుల దుకాణ యజమానులు ప్లాస్టిక్ సంచుల విక్రయదారులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 120 మైక్రాన్ కంటే తక్కువ మందంతో ఉన్న ప్లాస్టిక్ కవర్లను ఇతర ప్లాస్టిక్ వస్తువును పూర్తిగా నిషేధించాలన్నారు. ఎవరైనా విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

తెరుచుకోని సచివాలయం



తెరుచుకోని దేవరహట్టి సచివాలయం

గుడిబండ, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరహట్టి పంచాయతీ సచివాలయం గురువారం మూతపడింది. అధికారులు ఎవరూ హాజరు కాకుండా కార్యాలయం తెరుచుకోకపోవడంతో రైతులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పనుల నిమిత్తం ఆధార్‌కార్డు అప్డేట్ రైతుల వన్‌బిలు, అడంగల్ తదితర వాటికోసం వచ్చిన వెనుతిరిగారు. ఈ విషయమై ఎంపీడీఓ కేశవరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీతలాంబకు విశేష పూజలు

పావగడ, 24(ఆంధ్రజ్యోతి): ఆషాడం అమావాస్య సందర్భంగా గురువారం పట్టణంలో కొలువుదీరిన సీతలాంబ అమ్మవారికి గురువారం మహిళలు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 6గంటల నుంచి అమ్మవారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, శనీశ్వరునికి తైలాభిషేకం, నవగ్రహపూజలు చేశారు. శ్రావణ తొలి శుక్రవారం మొదలవుతుండటంతో శని మహాత్మ ఆలయమంతా స్వర్ణమందిరంగా తీర్చిదిద్దారు.

వరుస చోరీలతో ఆందోళన

రొప్పంలో ఒకేరాత్రి నాలుగు ఇళ్లలో..

పావగడ, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణవ్యాప్తంగా వరుసచోరీలు జరుగుతుండటంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. బుధవారం రాత్రి రొప్పంలో ఒకే వీధిలో నాలుగు ఇళ్లలో చోరీ అయ్యాయి. బాధితులు సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సత్యనారాయణ, మంజుళ, శాంతమ్మ, మరో ఇంటిలో చోరీ జరిగింది. సత్యనారాయణప్ప బంధువుల ఇంటికి వెళ్లడంతో 10గ్రాముల బంగారం రూ.లక్ష నగదును చోరీ చేశారు. మంజుల, శాంతమ్మ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో బంగారు, నగదు దోచుకెళ్లినట్లు ఫిర్యాదుచేశారు. పట్టణంలో వరుస చోరీలపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యేని కలిసిన హీరో శ్రీకాంత్



ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో హీరో శ్రీకాంత్ దంపతులు

మడకశిర టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజును గురువారం అనంతపురంలోని తన నివాసంలో సినీహీరో శ్రీకాంత్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. తాజారాజకీయాలపై చర్చించారు.

బంగారు భవిష్యత్తుకు బాటలు

రొద్దం, జూలై 24(ఆంధ్రజ్యోతి): రొద్దంలోని సుపరిపాలనకు తొలిఅడుగులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను టీడీపీ నాయకులు వివరించారు. టీడీపీ నాయకులు శ్రీనాథ్‌చౌదరి, పెనుకొండ మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ తిరుపాల్‌నాయుడు, సిద్దన్న, నాగ, వాల్మీకి పాల్గొన్నారు.

నీరుగారుతున్న స్వచ్ఛ లక్ష్యం

అద్దె ట్రాక్టర్లతో భారంగా మారుతున్న నిర్వహణ



బుళ్లసముద్రంలో 8 నెలలుగా నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్

మడకశిర రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి చెత్తతో సంపద కేంద్రాలకు తరలించి స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వం లక్ష్యం. అయితే ఆ లక్ష్యం నీరుగారుతోంది. చెత్త సేకరణకు సంబంధించి ట్రాక్టర్లను మంజూరుచేసి ట్రాలీలను ఇవ్వకపోవడంతో లక్ష్యం నెరవేరడంలేదు. అధిక జనాభా కలిగిన పంచాయతీలకు రూ.6 లక్షలు చెల్లించి ట్రాక్టర్లను మంజూరు చేసింది. అయితే చెత్తను తరలించేందుకు అవరమైన ట్రాలీలు ఇవ్వకపోవడంతో ట్రాక్టర్లు గ్రామ సచివాలయాల వద్ద నిరుపయోగంగా ఉంటున్నాయి. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో అధిక జనాభా ఉన్న పెద్ద పంచాయతీలకు 23 కొత్త ట్రాక్టర్లను అందజేశారు. మడకశిర మండలంలో బుళ్లసముద్రం, కల్లుమర్రి, వైబీ హళ్లి, మణూరు, గౌడనహళ్లి పంచాయతీలకు గుండబండ మండలంలో గుడిబండ, సీసీ గిరి, గుణేమోరుబాగల్, తాళికెర, దేవరహట్టి, రొళ్ల మండలంలో రొళ్ల, మీజీహళ్లి, ఎం రాయాపురం, హలికుంట, మల్లినమడుగు, అగళి మండలంలో మధూడి, కోడిపల్లి, ఆర్‌జీ హళ్లి, అమరాపురం మండలంలో ఐదు ట్రాక్టర్ ఇంజన్లను అందజేశారు. ఎనిమిది నెలల కిందట ఈ ట్రాక్టర్లు ఆయా కేంద్రాలకు చేరుకున్నా ట్రాలీలు లేక మూలనపడ్డాయి.

పారిశుధ్య పనులకు అద్దె ట్రాక్టర్లే దిక్కు

గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు ప్రభుత్వం అందించిన ట్రాక్టర్లకు ట్రాలీలు ఇవ్వలేదు. దీంతో తప్పని పరిస్థితుల్లో చెత్త సేకరణకు కొన్ని పంచాయతీల్లో అద్దె ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. మరికొన్ని పంచాయతీల్లో ట్రాలీలను అద్దెకు తీసుకుంటున్నారు. ప్రభుత్వం మంజూరుచేసిన ట్రాక్టర్లను ఉపయోగించకపోవడంతో అవి ఎండకు ఎండి వానకు తడిసి తుప్పుపడుతున్నాయని సర్పంచులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుని ట్రాక్టర్లకు ట్రాలీలు మంజూరు చేయాలని కోరుతున్నారు. అప్పుడే స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరుతుందని వారు అంటున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ సోనీబాయ్‌ని వివరణ అడగ్గా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామన్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



గ్రామ పంచాయతీల్లో సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించేందుకు ప్రభుత్వం ట్రాక్టర్లను మంజూరుచేసింది. అయితే చెత్తను తరలించేందుకు ట్రాలీలు ఇవ్వకపోవడంతో సమస్య ఎదురైంది. అద్దె ట్రాలీలు తీసుకుని చెత్తను తరలిస్తున్నాం. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే ట్రాలీలు మంజూరుచేయాలని కోరుతున్నా.

-రామాంజనేయులు, సర్పంచ్, వైబీ హళ్లి

అభ్యంతరాలు స్వీకరించండి

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

హిందూపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): పోలింగ్ బూత్‌లకు సంబంధించి రాజకీయ పార్టీల నాయకులు ఇచ్చిన అభ్యంతరాలు స్వీకరించి పోలింగ్‌స్టేషన్‌లో ఓటర్లకు అనుకూలంగా ఉండేలా చూడాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫారం 6 ఓటరు జాబితాలో కొత్తగా ఓటు నమోదుచేసుకునేవారు దీని ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 18ఏళ్లు నిండిన భారతీయులు ఓటరు నమోదు చేసుకోవాలన్నారు. కళాశాలలో యువ ఓటర్లను చేర్పించడానికి అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. పట్టణంలో ఒక వార్డు ఓటరు ఓటు మరోవార్డులో ఉందని వీటిని సరిదిద్దాలని టీడీపీ పట్టణ కన్వీనర్ వెంకటేశ్ జేసీని కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్, సౌజన్యలక్ష్మీ, నటరాజ్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, డీటీ మైనుద్దీన్, ఆర్ఐ అమర్, పట్టణ కన్వీనర్లు రాము, శ్రీనివాస్, అభిలాష్, నాయకులు రాఘవేంద్ర, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా రీసర్వే పూర్తి చేయండి: జేసీ

లేపాక్షి, (ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ సిబ్బంది నిర్వహిస్తున్న రీసర్వే పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. గురువారం ఆయన మండలంలో రీసర్వే వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ రీసర్వే పనులు వేగవంతం చేయాలని, నిర్దత సమయంలో పూర్తీచేయాలని సూచించారు. ఎలాంటి సందేహాలున్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సలహాలు తీసుకోవాలన్నారు. అనంతరం రీసర్వే రికార్డులను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ, వీఆర్‌ఓలు, ఆర్‌ఐలు ఆయన వెంట ఉన్నారు.

వైభవంగా చౌడేశ్వరీమాత జయంతి



పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



గోరంట్లలో..



చిలమత్తూరులో..



పూజల్లో పాల్గొన్న నిమ్మల కిష్టప్ప

హిందూపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలో వెలసిన చౌడేశ్వరి అమ్మవారి జయంతి గురువారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామునుంచే అమ్మవారికి పంచామృతాభిషేకం, కళశాచర్చన, నవగ్రహహోమం, చండీహోమం నిర్వహించారు. శివబాలయోగి ఆశ్రమం నుంచి మహిళలు బోనాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బండారు బాలాజీ, మునిసిపల్ చైర్మన్ రమేష్, నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు టీడీపీ నాయకులు కోరుముట్ల నాగేంద్ర, మంగేష్, తిరుపతయ్య, మాచి, అమర్నాథ్, ప్రెస్‌ఎవ ఎంకటేశ్, చంద్రమోహన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్సింపల్లి, గోరంట్లలో చౌడేశ్వరీ అమ్మవారి జయంత్యుత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. నార్సింపల్లిలో భవానీ మాతను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గోరంట్లలోని చౌడేశ్వరీ ఆలయంలో అర్చకులు నాగభూషణ అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహామంగళహారతి అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. వీర్సుకాలనీలో శ్రీరామలింగచౌడేశ్వరీ ఆలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి పురోహితులు తారనాథ్‌శర్మ ఆధ్వర్యంలో కుంకుమార్చన చేశారు. పూజల్లో మాజీ ఎంపీ నిమ్మలకిష్టప్ప, నిమ్మల చంద్రశేఖర్, నిమ్మల యువశేఖర్ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. దేవాంగులు, మహిళలు, ఆయల కమిటీ సభ్యులు జయంత్యుత్సవాల్లో పాల్గొన్నారు.

పరిగి, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దరెడ్డిపల్లి గ్రామంలో చౌడేశ్వరీ అమ్మవారి జయంత్యుత్సవాలను గురువారం ఆలయ కమిటీ అధ్యక్షులు వెంకటరమణస్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రుద్రప్ప, రమేష్, రామకృష్ణ, సదాశివ, ప్రభాకర్, ఆదినారాయణ, కిష్టప్ప, లక్ష్మీనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు, (ఆంధ్రజ్యోతి): చౌడేశ్వరీమాత జయంత్యుత్సవాలు దేమకేతేపల్లిలో గురువారం వైభవంగా జరిగాయి. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు మహామంగళహారతి, తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేపట్టారు.

ఆర్థికసాయం అందజేత

పరిగి, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఊటకూరు గ్రామానికి చెందిన విద్యార్థి అఖిల్ రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు మృతుడి కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. అనంతరం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోవిందరెడ్డి, బీచిగానిపల్లి సర్పంచ్ బాలాజీ, మాజీ ఎంపీటీసీ సోమప్ప, యూజీ వెంకటేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల కోసం 4,867 దరఖాస్తులు

మడకశిర రూరల్, జూలై24(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాల కోసం ఇప్పటి వరకు 4867 దరఖాస్తులు వచ్చినట్లు హౌసింగ్ ఏఈ నాగభూషణం తెలిపారు. పట్టణం నుంచి 1079 దరఖాస్తులు రాగా అందులో ఇంటి స్థలం లేనివారు 680మంది, ఇంటి నిర్మాణాలకు స్థలం ఉన్న వారు 396 మంది ఉన్నారన్నారు. మండలంలోని 16 పంచాయతీల పరిధిలో 3788 దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో ఇంటి నిర్మాణాలకోసం స్థలం ఉన్నవారు 3387 మంది, స్థలంలేని వారు 401 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు.

నీటికుంటలో పడి వృద్ధురాలి మృతి

పరిగి, జూలై 24(ఆంధ్రజ్యోతి): శీగుపల్లికి చెందిన గంగమ్మ(76) నీటికుంటలో పడి మృతిచెందినట్లు జమేదార్ శ్రీనివాసులు తెలిపారు. గంగమ్మ నీటి కుంట వద్దకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతిచెందినట్లు తెలిపారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని వెలకితీసి పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు హనుమంతప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు జమేదార్ తెలిపారు.

జిల్లా మహాసభల పోస్టర్ల విడుదల

సోమందేపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా రెండో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను నాయకులు గురువారం స్థానిక జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూలై 31, ఆగస్టు 1న ధర్మవరం కేంద్రంగా మహాసభలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రాజగోపాల్, నాయకులు చాంద్‌బాషా, అంజినమ్మ, చిల నారాయణస్వామి, ఈడిగ నాగరాజు, మల్లేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలను ఎంపిక చేయండి: ఆర్డీఓ

సోమందేపల్లి, జూలై24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పీ-4 పథకం ద్వారా పేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు బంగారు కుటుంబాలను ఎంపిక ప్రక్రియ చేపట్టిందని అధికారులు జాగ్రత్తగా ఎంపిక చేపట్టాలని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన పీ-4 పథకం లక్ష్యం, ఉద్దేశాలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ వెంకటలక్ష్మీ, ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, కార్యదర్శి రామాంజినేయులు, నాయకులు నీరుగంటి చంద్ర, కన్వీనర్ వెంకటేశులు, సిద్దలింగప్ప పాల్గొన్నారు.

'స్మార్ట్ మీటర్లు రద్దు చేయండి'

పెనుకొండ, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాసంఘాలు నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయం జరిగింది. రైతు సంఘం అధ్యక్షుడు హరి, సీఐటీయూ నాయకులు బాబావలి మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని హామీఇచ్చి గెలిచిన తరువాత హామీలను తుంగలోతొక్కడం జరిగిందన్నారు. స్మార్ట్‌మీటర్లను వెంటనే రద్దుచేయాలని లేనిపక్షంలో దశలవారీగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో హమాలీసంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, వివిధ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

హిందూపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యాన్ని పట్టుకుని ఇద్దరిని అరెస్ట్‌చేసినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. పోచనపల్లివద్ద గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ప్రభుకుమార్ ద్విచక్రవాహనంలో కర్ణాటక మద్యం తీసుకొస్తున్నాడు. అతడిని పట్టుకుని ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరచాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు పృథ్వి, ఫారూక్, నారాయణస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలిగ్రామానికి చెందిన 25యేళ్ల వివాహిత మహిళ యాసిడ్ తాగి గురువారం ఆత్మహత్యాకి పాల్పడ్డారు. భార్య భర్తల మధ్య నెలకున్న వివాదం కారణంగా ఇంటిలోని మరుగుదొడ్లు శుభ్రానికి ఉపయోగించే యాసిడ్ ద్రావకాన్ని తాగి అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించినట్లు వైద్యులు తెలిపారు.

విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

తహసీల్దార్ సౌజన్యలక్ష్మి

లేపాక్షి, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ అన్నారు. గురువారం ఆమె బాలికల వసతిగృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట హాస్టల్ సిబ్బంది, వీఆర్‌ఓలు ఉన్నారు.

చిరుధాన్యాల సాగుతోనే ఆర్థిక అభివృద్ధి

- ఏరువాక శాస్త్రవేత్తలు

గుడిబండ, జూలై 24(ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాల సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని పుట్టపర్తి ఏరువాక శాస్త్రవేత్త రామసుబ్బయ్య, ఏడీ కృష్ణమీనన్, ఏఓ వీరనరేష్ సూచించారు. గురువారం వెలుగు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, కంది, పత్తి, కొర్ర, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేయవచ్చని సూచించారు. చిరుధాన్యాలు తినడంవల్ల ఆరోగ్యంగా ఉండగలరన్నారు. దిగుబడికూడా అధికంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం తిప్పన్న, ఏపీ మాస్ డైరెక్టర్ గోపాల్, రాజు, సీసీదేవరాజు, సేవాకేంద్రం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ప్రేమవాహిని రథోత్సవానికి ఘనస్వాగతం

పెనుకొండ, జూలై 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో భాగంగా విశ్వశాంతి కోరుతూ దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న సత్యసాయి ప్రేమవాహిని రథోత్సవం గురువారం పెనుకొండకు చేరుకుంది. పెనుకొండ ప్రజలు ఘనస్వాగతం పలికారు. ప్రేమవాహిని అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ రథోత్సవంలో మహిళలు కళశాలతో ప్రదర్శన, కోలాటం, మంగళవాయిద్యాలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తూ మంగళహారతులు అందించారు. కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్లు సత్యసాయి కన్వీనర్లు కమిటీ సభ్యులు అనుబంధ భజనమండలి కన్వీనర్లు సేవాదళ్ సభ్యులు బాలవికాస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వసుంధరాదేవి రాక

హిందూపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి శుక్రవారం హిందూపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. గోళ్లాపురం వద్ద రూ.3కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభిస్తారు. చిలమత్తూరు మండలం తమ్మినాయనపల్లి రోడ్డుకు భూమిపూజ, లేపాక్షి మండలం బిసలమానేపల్లి-ఓబుళాపురం తారు రోడ్డు ప్రారంభోత్సవం, నవోదయ పాఠశాలలో సోలార్ గీజర్‌లు ప్రారంభం, సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో శ్రీకంఠపురం, వీవర్స్‌కాలనీలో పాల్గొనున్నారని టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తెలిపారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు దారుణం: టీడీపీ

మడకశిర టౌన్, జూలై24(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఎంఎస్ రాజుపై వైసీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప అసత్య ఆరోపణలు చేయడం దారుణమని నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిని విమర్శించే హక్కు వైసీపీ నాయకులకు లేదన్నారు. వారు ఆత్మపరిశీలన చేసుకుని మాట్లాడాలన్నారు. సమావేశంలో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు భక్తర్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, సింగిల్ విండో అధ్యక్షుడు నరష్, కౌన్సిలర్ నాగేంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జి రవికుమార్ పాల్గొన్నారు.

రొళ్ల(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక వైసీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆరోపణలు చేస్తున్నారని ఒక్కళిగ సాధికార కన్వీనర్ పాండురంగప్ప అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రస్తుతం ఏడాది పాలనలో అభివృద్ధిపరుగులు పెడుతోందన్నారు.

గుడిబండ, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక వైసీపీ ఇన్‌చార్జి ఈరలక్కప్ప తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సింగిల్ విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, మాజీ ఆసుపత్రి కమిటీ చైర్మన్ శివకుమార్, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు మంజునాథ్, జిల్లా వీరశైవ లింగాయత్ అధ్యక్షుల దుర్గేష్, ఎంపీటీసీ శశిధర్, క్లస్టర్ ఇన్‌చార్జి భీమరాజు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

అగళి, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈనెల 26న మండల సర్వసభ్య సమావేశం ఉదయం 10.30గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సమావేశానికి ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు తదితరులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

'ఏ కష్టమొచ్చినా ఆదుకుంటాం'



నాయకులను సన్మానిస్తున్న వెంకటేశ్వర్లు

సోమందేపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా ఆదుకుంటామని టీడీపీ నాయకుడు వెంకటేశ్వర్లు అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని మండలంలో నాయకులు విజయవంతంగా పూర్తి చేసినందుకు ఆయన వారిని అభినందించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్‌కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ పార్టీకోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్త, నాయకుడిని ఎన్నడూ మరిచిపోదన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ వెంకటేశులు, నీరుగంటి చంద్ర, సిద్దలింగప్ప, సూరీ, సీసీహరి, కిష్టప్ప, ప్రభాకర్, ఆకుల రమణ పాల్గొన్నారు.